**పాఠకులకు గమనిక**
ఆంధ్రజ్యోతి దిన పత్రిక కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు, ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఏవైనా సమస్యలుంటే క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
A.C.O - 9003200801
S.R - 9551168092
ఆంధ్రజ్యోతి చిరునామా : జి4, గ్రౌండ్ ఫ్లోర్, రామ్స్ అపార్ట్‌మెంట్, ఓల్డ్ నెం. 40, న్యూ నెంబర్ 35, విజయ రాఘవ రోడ్డు, టి.నగర్, చెన్నై - 600 017




చెన్నై రాజ్‌భవన్‌లో శుక్రవారం ఉదయం జరిగిన కార్యక్రమంలో ఆవడి ఆర్డినెన్స్ డిపో 35వ ఫీల్డ్ రెజిమెంట్, 65 కంపెనీ ఆర్మీ సర్వీస్ కార్ప్స్ విభాగం దేశానికి చేస్తున్న విశిష్ట సేవలను కొనియాడుతూ లెఫ్టినెంట్ జనరల్ కరణ్‌బీర్ సింగ్ బ్రార్‌కు ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న గవర్నర్ ఆర్.ఎన్.రవి



రాజ్‌భవన్‌లో గవర్నర్ ఆర్ఎన్ రవి చేతులమీదుగా సత్కారాలు అందుకున్న ఆవడి ఆర్డినెన్స్ డిపో 35వ ఫీల్డ్ రెజిమెంట్, 65 కంపెనీ ఆర్మీ సర్వీస్ కార్ప్స్ విభాగానికి చెందిన అధికారులు, సభ్యులు

# నేడు రాష్ట్రానికి ప్రధాని

- రూ.4500 కోట్ల పథకాల ప్రారంభం
- తూత్తుకుడి, గంగైకొండచోళపురంలో భారీ భద్రతా ఏర్పాట్లు



చెన్నై, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల పర్యటన నిమిత్తం ప్రధాని నరేంద్రమోదీ రాష్ట్రానికి విచ్చేయనున్నారు. శనివారం సాయంత్రం మాల్దీవుల్లో మోదీ తన కార్యక్రమాలను ము గించుకుని విమానంలో రాత్రి 8 గంటల ప్రాంతంలో తూత్తుకుడి విమానాశ్రయం చేరుకుంటారు. అనంతరం తూత్తుకుడి విమానాశ్రయాన్ని ఆయన ప్రారంభించనున్నారు.ఈ సందర్భంగా పలు పథకాలను ప్రారంభించి, కొత్త పథకాలకు శంకుస్థాపన చేయనున్నారు. ఆ కార్యక్రమం అనంతరం మోదీ విమానంలో బయలుదేరి తిరుచ్చి చేరుకుని, ఓ స్టార్‌హోటల్‌లో బసచేయనున్నారు. ఆదివారం ఉదయం 11.30 గంటలకు తిరుచ్చి నుండి హెలికాప్టర్‌లో అరియలూరు జిల్లా గంగైకొండచోళపురానికి చేరుకుంటారు. అక్కడ శివాలయానికి వెళ్ళి దైవదర్శనం చేసుకుంటారు.సుమారు మూడు గంటలసేపు రాజేంద్రచోళుడి జయంత్యుత్సవాలు సహా త్రివిధ ఉత్సవాల్లో ఆయన పాల్గొంటారు.ఆ సందర్భంగా ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా 'తిరువాసగం' సింఫనీ కార్యక్రమాన్ని కూడా ప్రధాని వీక్షించనున్నారు. ఈ వేడుకలు ముగిసిన తర్వాత ఆయన హెలికాప్టర్‌లో తిరుచ్చికి తిరిగి వెళతారు. అక్కడి నుండి ప్రత్యేక విమానంలో ఢిల్లీ బయలుదేరి వెళతారు.

### ఐదంచెల భద్రతా ఏర్పాట్లు..

ప్రధాని మోదీ పర్యటన నేపథ్యంలో తూత్తుకుడి విమానాశ్రయం వద్ద, గంగైకొండ చోళపురం వద్ద పోలీసులు ఐదంచెల భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నారు. రూ.380 కోట్లతో పునర్నిర్మించిన తూత్తుకుడి విమానాశ్రయం ప్రారంభోత్సవం చేసి, అక్కడే ప్రధాని మోదీ కూడన్‌కుళం అణు విద్యుత్ కేంద్రంలో రూ.548 కోట్లతో 3,4వ యూనిట్ల నుంచి విద్యుత్‌ను సరఫరాకు ఏర్పాటైన పవర్ ట్రాన్స్‌మిషన్ సిస్టంకు శంకుస్థాపన చేయనున్నారు. మోదీ సభ కోసం విమానాశ్రయం వద్ద భారీ పందిరి కూడా నిర్మించారు. ప్రస్తుతం ఆ విమానాశ్రయం పూర్తిగా పోలీసుల భద్రతావలయంలో ఉంది ప్రధాన రహదారులలో వాహనాలను తనిఖీ చేసిన మీదటే పంపుతున్నారు. సౌత్‌జోన్ ఐజీ ప్రేమానంద్ సిన్హా నేతృత్వంలో తిరునల్వేలి డీఐజీ సంతోష్ హతిమణి, తూత్తుకుడి ఎస్పీ ఆల్బర్ట్‌జాన్ పర్యవేక్షణలో సుమారు రెండువేల మంది పోలీసులతో ఐదెంచెల భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నారు. ఇదే విధంగా భారత నావికాదళ అధికారులు కూడా సముద్రతీరం పొడవునా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను చేపడుతున్నట్లు ప్రకటించారు.

### ఈపీఎస్, ఓపీఎస్‌లతో భేటీ...!

తిరుచ్చి స్టార్‌హోటల్‌లో బసచేయనున్న ప్రధాని మోదీతో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి(ఈపీఎస్)ని, మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం (ఓపీఎస్)తో వేర్వేరుగా భేటీ కానున్నట్లు సమాచారం. ఆదివారం ఉదయం ప్రధాని మోదీతో వీరిద్దరు సమావేశమవుతారని తెలుస్తోంది. ప్రధానిని కలుసుకునేందుకు అమ్మామక్కల్ మున్నేట్ర కళగం నేత టీటీవీ దినకరన్, టీఎంసీ నేత జీకే వాసన్, ఐజేకే నాయకుడు పారివేందర్, జాన్ పాండియన్, మదురై ఆధీనం అప్పాయింట్ కోరారు. అయితే ఈపీఎస్, ఓపీఎస్‌కు మాత్రమే కలుసుకునేందుకు మోదీ సుముఖత వ్యక్తం చేసినట్లు సమాచారం.

### రూ.1030 కోట్ల రైల్వే ప్రాజెక్టులు..

తూత్తుకుడి ఎయిర్‌పోర్ట్‌లో జరిగే సభలోనే ప్రధాని నరేంద్రమోదీ రూ.1030 కోట్లతో చేపట్టిన పథకాలను జాతికి అంకితం చేయనున్నారు. మదురై - బోడినాయకనూరు మధ్య 90 కి.మీ. రైలు మార్గం విద్యుద్దీకరణ ప్రాజెక్టును ఆయన ప్రారంభిస్తారు. ఆ మార్గంలో అదనపు ఎక్స్‌ప్రెస్ రైళ్లను కూడా ప్రవేశపెడతారు. ఇదేవిధంగా తిరువనంతపురం - కన్నియాకుమారి ప్రాజెక్టులో భాగంగా నాగర్‌కోవిల్ - కన్నియాకుమారి మధ్య రూ.650 కోట్లతో చేపట్టిన 21 కి.మీ. రైలు మార్గం డబ్లింగ్ ప్రాజెక్టును ప్రారంభిస్తారు. ఇక రూ.283 కోట్లతో ఆరల్‌వాయ్‌మొళి - నాగరకోవిల్ జంక్షన్ మధ్య (12.87 కి.మీ.లు) తిరునల్వేలి - మేలపాళయం (3.6 కి.మీ.) రైలు మార్గం డబ్లింగ్ ప్రాజెక్టులకు కూడా మోదీ ప్రారంభోత్సవం చేయనున్నారు.

# కాషాయానికి నో ఎంట్రీ

- డిప్యూటీ సీఎం ఉదయనిధి



సభలో ప్రసంగిస్తున్న ఉదయనిధి

చెన్నై, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మతచిచ్చు రగిల్చేందుకు ప్రయత్నిస్తున్న కాషాయ పార్టీలను, నేతలను అడ్డుకుంటామని డీఎంకే యువజన విభాగం కార్యదర్శి ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి పేర్కొన్నారు. నగరంలో శుక్రవారం జరిగిన బూత్‌కమిటీ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న ప్రధాన ప్రతిపక్షాలన్నీ బూత్‌కమిటీలను ఏర్పాటు చేసుకోలేని పరిస్థితిలో ఉన్నాయని చెప్పారు. డీఎంకేకు సంబంధించినంతవరకూ దశబ్దాల తరబడి బూత్‌కమిటీలు సమర్థవంతంగా పనిచేయగలుగుతున్నాయని ఆయన కితాబిచ్చారు. ఇటీవల తిరువణ్ణామలైలో జరిగిన పార్టీ సమావేశంలో ఎన్నికల బరిలో డీఎంకే అన్ని పార్టీలకంటే ముందుగా దూసుకెళ్లతోందని చెప్పానని, ఆ ప్రకారమే నాలుగేళ్ల డీఎంకే పాలనలో అమలు చేసిన పథకాలపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని, వారి అండదండలు డీఎంకే కూటమికే లభిస్తాయనే విశ్వాసం తనకుందన్నారు. రాష్ట్రంలోకి అడ్డదారుల్లో అక్రమంగా ప్రవేశించి మత చిచ్చురగిల్చాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్న కాషాయ పార్టీకి, ఆ పార్టీ నేతలకు అన్నాడీఎంకే నేత ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) రెడ్‌కార్పెట్‌తో స్వాగతం పలుకుతుండటం సిగ్గుచేటైన విషయమని ఎద్దేవా చేశారు. పునర్విభజన పేరుతో రాష్ట్రంలో ఎంపీల సంఖ్యను తగ్గించేందుకు ప్రయత్నిస్తున్న బీజేపీతో ఈపీఎస్ చేతులు కలుపటం భావ్యమేనా అని ఆలోచించాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకేకూటమి చిత్తుగా ఓడిపోవటం ఖాయమన్నారు. ఈ సభలో మంత్రి పీకే శేఖర్‌బాబు, ఎంపీ దయానిధి మారన్, మేయర్ ఆర్.ప్రియ, శాసనసభ్యులు తాయగం కవి, పరంధామన్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో వైద్య కోర్సుల ర్యాంకుల జాబితా విడుదల



ర్యాంకుల జాబితా విడుదల చేస్తున్న మంత్రి ఎం.సుబ్రమణ్యం

అడయార్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ వైద్యకళాశాలలు, ప్రైవేటు, స్వయంప్రతిపత్తి కళాశాలల్లో ఉన్న ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సులకు సంబంధించి ర్యాంకుల జాబితా విడుదలైంది. ఆరోగ్య శాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం శుక్రవారం ఈ జాబితాను గిండిలోని కలైంజర్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో విడుదల చేశారు. ఆ ప్రకారం, 7.5 శాతం రిజర్వేషన్ కోటాలో కళ్లకుర్చి జిల్లా విద్యార్థి తిరుమూర్తి 572 మార్కులతో ప్రథమస్థానం, ప్రభుత్వ కోటా ర్యాంకుల జాబితాలో తిరునల్వేలి జిల్లాకు చెందిన సూర్యనారాయణ 665 మార్కులతో ప్రథమస్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా మంత్రి సుబ్రమణ్యం మాట్లాడుతూ... 2025-26 విద్యా సంవత్సరం వైద్య, దంత వైద్యకళాశాలల్లో ప్రభుత్వ సీట్లు, స్వయం ప్రతిపత్తి కళాశాలల్లో ప్రభుత్వ కోటా, మేనేజ్‌మెంట్ కోటా సీట్లకు దరఖాస్తుల స్వీకరణ గత జూన్ 6న ప్రారంభమై 29వ తేది వరకు కొనసాగిందన్నారు. ఈ విద్యా సంవత్సరం 72,743 దరఖాస్తులందాయని, గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది 29,680 దరఖాస్తులు అధికంగా వచ్చాయని తెలిపారు. విద్యార్థులు శ్రమ పడకుండా, దరఖాస్తు వివరాల సవరణలకు అవకాశం కల్పించామన్నారు. దరఖాస్తుతో పాటు 25 మంది నకిలీ సర్టిఫికెట్లు సమర్పించడంతో వారిని అనర్హులుగా ప్రకటించామని తెలిపారు. ప్రత్యేక విభాగంలో అందిన దరఖాస్తుల్లో 7.5 శాతం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కేటాయించిన సీట్లకు 477 దరఖాస్తులు వచ్చాయన్నారు. అలాగే, మాజీ సైనికుల వారసుల విభాగంలో 642, దివ్యాంగుల విభాగంలో 148 దరఖాస్తులందాయని తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరం ప్రభుత్వ వైద్యకళాశాలలు, ప్రభుత్వ కోటాలో స్వయం ప్రతిపత్తి కళాశాలలు కేటాయించిన మొత్తం 6,600 సీట్లున్నాయన్నారు. అలాగే, ప్రభుత్వ దంత వైద్యకళాశాలలు, ప్రభుత్వ కోటాలో స్వయం ప్రతిపత్తి కళాశాలలకు కేటాయించిన మొత్తం 1,583 సీట్లున్నాయన్నారు. ప్రభుత్వ కోటా సీట్లకు 42,315 దరఖాస్తులు సమర్పించగా, వాటిలో 39,853 దరఖాస్తులను అంగీకరించామని తెలిపారు. ప్రభుత్వ కోటా, స్వయం ప్రతిపత్తి కళాశాలల్లో కోటా కింద 7.5 శాతం రిజర్వేషన్ కింద ఎంబీబీఎస్‌లో 495 సీట్లు, బీడీఎస్‌లో 119 సీట్లున్నాయని మంత్రి తెలిపారు.

# ఆస్పత్రిలోనే స్టాలిన్

- కుదుటపడ్డ ఆరోగ్యం
- మంత్రుల పరామర్శ



చెన్నై, జూలై 25 (ఆంధ్రజ్యోతి): అస్వస్థత కారణంగా అపోలో ఆస్పత్రిలో చేరిన ముఖ్యమంత్రి స్టాలిన్ ఆరోగ్యం కుదుటపడుతోంది. ఆంజియోగ్రామ్ తర్వాత ఆయన కోలుకుంటున్నట్లు వైద్యనిపుణులు వెల్లడించారు. గత సోమవారం ఉదయం అపోలో ఆస్పత్రిలో చేరిన స్టాలిన్ ఎప్పుడు డిశ్చార్జ్ అవుతారా అని పార్టీ శ్రేణులు ఎదురుచూస్తున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, సీఎం స్టాలిన్ సోదరి సెల్వి, సోదరుడు ఎంకే తమిళరసు, స్పీకర్ అప్పావు, మంత్రులు కేఎన్ నెహ్రూ, ఐ.పెరియసామి, దామో అన్బరసన్, ఎం.సుబ్రమణ్యం, మాజీ మంత్రి పొన్ముడి, ఏకే విజయన్ తదితరులు అపోలో ఆస్పత్రికి వెళ్లి సీఎం స్టాలిన్‌ను పరామర్శించారు.


### రాందాస్‌కు సీఎం జన్మదిన శుభాకాంక్షలు

అడయార్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పీఎంకే వ్యవస్థాపకుడు డా.రాందాస్‌కు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సీఎం తన ఎక్స్ పేజీలో... 'రాందాస్‌కు జన్మదిన శుభాకాంక్షలు. ఆయురారోగ్యాలతో, తన రాజకీయ ప్రస్థానం కొనసాగించాలని హృదయపూర్వకంగా కోరుకుంటున్నట్లు' సీఎం పోస్ట్ చేశారు.

# ఈపీఎస్ సరికొత్త పంథా

- అమలు కాని హామీలను వివరిస్తూ ప్రచారం

ప్యారీస్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఓటర్లను ఆకట్టుకునేలా అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) 'దోపిడీలు-దొంగలు', 'సత్యం కోసం-స్వేచ్ఛ కోసం'అనే కొత్త ప్రచార పథకానికి శ్రీకారం చుట్టారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రప్రజలకు ఇచ్చిన హామీల్లో డీఎంకే ప్రభుత్వం 99 శాతం నెరవేర్చకుండా ప్రజలకు మొండి చెయ్యి చూపించిందన్న పదాలతో కూడిన లోగోను ఆయన ఆవిష్కరించారు. 2026 అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి ప్రజలను కలుసుకుని డీఎంకే ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేలా ఈ నెల 7న కోవై జిల్లా మేట్టుపాళయం నుంచి తన ప్రచార యాత్ర ప్రారంభించిన ఈపీఎస్ ప్రస్తుతం పుదుకోట జిల్లాల్లోని నియోజకవర్గాల్లో పర్యటిస్తున్నారు. శుక్రవారం ఉదయం తన పర్యటనలో భాగంగా 2021 అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే ఇచ్చిన 525 హామీల్లో నెరవేర్చని 10 హామీల గురించి ప్రజలకు వివరించేలా రూపొందించిన లోగోను పుదుకోట రోడ్‌షోలో ఆవిష్కరించారు. అనంతరం తాను చేపట్టిన వినూత్న ప్రచారం గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను చేపట్టిన 'మక్కలై కాప్పోం-తమిళగత్తై మీడ్పోం' ప్రచారం ప్రజల అండదండలు, మిత్రపక్షాల మద్దతుతో విల్లుపురం, కడలూరు, పెరంబలూరు, అరియలూరు, తిరువారూర్, నాగపట్నం, తంజావూరు జిల్లాల్లోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో విజయవంతంగా సాగిందన్నారు.గత అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో విద్యార్థులకు ల్యాప్‌ట్యాప్‌లు పంపిణీ చేశామని, అదేవిధంగా ఉన్నత విద్యలో చేరి చదువుకునేందుకు బ్యాంకుల ద్వారా తక్కువ వడ్డీకి రుణాలు మంజూరు చేయించామని, అయితే ఈ నాలుగేళ్లలో డీఎంకే ప్రభుత్వం ఆ పథకాలను నిలిపివేసిందన్నారు. గ్రామ పంచాయతీలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాల్సిన సీఎం స్టాలిన్ ప్రభుత్వం సొంత తోటల్లో నిర్మించుకునే ఇళ్లకు కూడా అనుమతి పొందాలని, లేనిపక్షంలో వాటికి సీలు వేయాలని ఆదేశాలివ్వడం, సరికాదని, ఇప్పటివరకు ఆచరణలో లేని ఈ సంఘటనపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రిసీడియం కార్యదర్శి, మాజీ మంత్రి, పుదుకోట ఎమ్మెల్యే డా.సి.విజయ్‌భాస్కర్, మాజీఎమ్మెల్యే నెడుంచెళియన్‌లతో పాటు యువజన, కార్మిక తదితర విభాగాలకు చెందిన నిర్వాహకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



అమలు కానీ హామీల గురించి వివరిస్తున్న ఈపీఎస్

### ఘనంగా పీఎంకే అధినేత రాందాస్

# జన్మదిన వేడుకలు



కార్యక్రమాన్ని వీడియో తీస్తున్న డాక్టర్ రాందాస్

ప్యారీస్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పాట్టాలి మక్కల్ కట్చి (పీఎంకే) వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ శుక్రవారం 87వ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా ఆ పార్టీ శ్రేణులు ఘనంగా జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. విల్లుపురం జిల్లా దిండువనం సమీపంలోని కోనేరికుప్పంలో రాందాస్ ఎడ్యుకేషన్ ట్రస్ట్‌లోని సరస్వతి కళాశాల ప్రాంగణంలో విద్యార్థులు 87 మొక్కలు నాటగా, పార్టీ నిర్వాహకుల మధ్య రాందాస్ తన జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వాలీబాల్ కోర్ట్, సౌర విద్యుత్ పథకం, కర్రసాము పోటీలను ఆయన ప్రారంభించారు. మొక్కలు నాటిన విద్యార్థిని, విద్యార్థులను వీడియో తీసి ఆనందాన్ని పంచుకున్నారు. ఫోన్‌లో తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని నరేంద్రమోదీ, హోంశాఖ మంత్రి అమిత్ షా, ముఖ్యమంత్రి స్టాలిన్, ప్రతిపక్ష నేత ఎడప్పాడి పళనిస్వామి పలువురు ప్రముఖులకు ఈ సందర్భంగా రాందాస్ ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో వర్షపు నీరు చుక్క కూడా సముద్రంపాలు కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ వేడుకల్లో రాందాస్ సతీమణి సరస్వతి, కుమార్తె గాంధీమతి, పార్టీ గౌరవాధ్యక్షుడు జీకే.మణి తదితరులు పాల్గొన్నారు.

### ఆరంబాక్కం అత్యాచార నిందితుడు

# సూళ్లూరుపేటలో పట్టుబడ్డాడు



సూళ్లూరుపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరు జిల్లా ఆరంబాక్కంలో చిన్నారిపై అత్యాచారానికి పాల్పడ్డ యువకుడు.. శుక్రవారం రాత్రి తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో పట్టుబడ్డాడు. రైల్వే స్టేషన్ వద్ద ఇతడిని ఆరంబాక్కం పోలీసులు పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. ఆరంబాక్కంలో ఈ నెల 12వ తేది సాయంత్రం పాఠశాల నుంచి ఇంటికి నడిచి వెళ్తున్న నాలుగో తరగతి చదివే బాలికపై ఓ యువకుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ ఘటన తమిళనాడులో కలకలం రేపింది. దీనిపై ప్రతిపక్షాలు సైతం ఆందోళన చేశాయి. ఈ క్రమంలో తిరువళ్లూరు ఎస్పీ వివేకానంద శుక్లా 10 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితుడి ఆచూకీ కోసం అన్ని ప్రాంతాల్లో విస్తృతంగా గాలించారు. ఘటన జరిగిన రోజు నిందితుడు సెల్‌ఫోన్‌లో మాట్లాడినట్లు గుర్తించారు. నిందితుడి ఎవరెవరితో మాట్లాడాడనే వివరాలు సేకరించారు. సంఘటన స్థలంలోని సీసీ కెమెరాల ద్వారా నిందితుడు పలు ప్రాంతాల్లో.. లోకల్ మెమో రైళ్లలో తిరిగే ఫొటోలను పోలీసులు గుర్తించారు. ఈ ఫొటోలను 22వ తేదీన ఆరంబాక్కం పోలీసులు విడుదల చేశారు. ఇతడి ఆచూకీ చెబితే రూ.5 లక్షలు నజరానా ఇస్తామని ప్రకటించారు. సూళ్లూరుపేట, తడ, వరదయ్యపాళెం ప్రాంతాల్లో నిందితుడు తిరుగుతున్నట్లు గుర్తించి.. మూడు రోజులుగా విస్తృతంగా గాలిస్తున్నారు. ముఖ్యంగా గుమ్మడిపూడి నుంచి సూళ్లూరుపేట వరకు రైల్వే స్టేషన్లలో దృష్టి పెట్టారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి సూళ్లూరుపేట రైల్వే స్టేషన్ మూడో ప్లాట్‌ఫారం వద్ద తిరుగుతున్న నిందితుడిని ఆరంబాక్కం పోలీసులు చాకచక్యంతో పట్టుకుని తీసుకెళ్లారు. శనివారం తమిళనాడులో అరెస్టు చూపే అవకాశం ఉంది.

## సమాచార దర్శిని

### రేపు 'తెలుగు పద్య వైభవం'

చెన్నై, జూలై 25 (ఆంధ్రజ్యోతి): 'వేద విజ్ఞాన వేదిక' ఆధ్వర్యంలో తరతరాల తెలుగు కవిత ఉపన్యాస ధారావాహిక 163వ ప్రసంగం 'తెలుగు పద్యవైభవం' ఆదివారం జరుగనుంది. టి.నగర్ విజయరాఘవరోడ్డులోని ఆంధ్రా క్లబ్ కృష్ణా హాలులో సాయంత్రం 6.30 గంటలకు జరుగనున్న ఈ కార్యక్రమంలో పాలకొల్లుకు చెందిన విశ్రాంత ప్రధానాచార్యులు చేగొండి వీర వెంకట సత్యనారాయణమూర్తి ప్రసంగించనున్నారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని వేదవిజ్ఞన వేదిక అధ్యక్షులు జేకే రెడ్డి, కార్యదర్శి కందనూరు మధు విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

### జర్నలిజంలో పీజీ డిప్లొమా కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రారంభించిన చెన్నై ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జర్నలిజంలో 2025-26వ విద్యా సంవత్సరంలో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమోకోర్సుకు దరఖాస్తు చేసుకోవచ్చు. తమిళం, ఆంగ్లంలో బోధన చేపట్టనున్నారు. ప్రింట్, టెలివిజన్, రేడియో, ఆన్‌లైన్ మీడియాలో ఉపాధి అవకాశాలు కల్పించేలా పాఠ్యాంశాలు రూపొందించారు.ఆసక్తికలిగినవారు https://cij.tn.gov.in // అనే వెబ్‌సైట్‌లో ఆగస్టు 3వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవచ్చని సచివాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

### తాంబరం-తిరుచ్చి ప్రత్యేక రైళ్ల పొడిగింపు

పెరంబూర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): తాంబరం-తిరుచ్చి-తాంబరం రైళ్ల సేవలు పొడిగించినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. నెం.06190 తిరుచ్చి-తాంబరం, నెం.06191 తాంబరం-తిరుచ్చి ప్రత్యేక రైళ్లు ఆగస్టు 1 నుంచి 31వ తేది వరకు (మంగళ, బుధ, శుక్ర, శని, ఆదివారం) 23 సర్వీసులు పొడిగించినట్లు దక్షిణ రైల్వే తెలిపింది.

### అక్టోబరు 12న పీజీ టీచర్ల రాతపరీక్ష

పెరంబూర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ పోస్టుల రాతపరీక్ష అక్టోబరు 12వ తేది నిర్వహించనున్నట్లు ఉపాధ్యాయ ఎంపిక బోర్డు (టీఆర్బీ) తెలిపింది. ఈ మేరకు టీఆర్బీ ఛైర్మెన్ ఎస్.జయంతి విడుదల చేసిన ప్రకటనలో... ప్రభుత్వ మహోన్నత పాఠశాలల్లో పీజీ టీచర్లు, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ (గ్రేడ్-1), కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్ (గ్రేడ్-1) పరీక్షల నోటిఫికేషన్ ఈ నెల 10వ తేది విడుదల చేయగా, రాతపరీక్ష సెప్టెంబరు 28న జరుగుతుందని ప్రకటించారు. కానీ, అదే రోజు టీఎన్‌పీఎస్సీ గ్రూప్-2 పరీక్ష జరుగనున్న నేపథ్యంలో, పీజీ టీచర్లు, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్ రాతపరీక్ష అక్టోబరు 12వ తేదీకి మార్చినట్లు టీఆర్బీ తెలిపింది.

### ప్రైవేటుకు 658 పార్కుల పర్యవేక్షణ

పెరంబూర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ)లో ఉద్యోగుల కొరత కారణంగా, 658 పార్కుల పర్యవేక్షణ ప్రైవేటు సంస్థలకు అప్పగించారు. జీసీసీ పరిధిలోని 1 నుంచి 5 మండలాల్లో 196 పార్కులు, 6 నుంచి 10 వరకు 301, 11 నుంచి 15 మండలాల్లో 41 మొత్తం 908 పార్కులున్నాయి. కానీ, పార్క్ పర్యవేక్షణకు 240 మంది ఉద్యోగులు మాత్రమే ఉన్నారు. ఈ విషయమై జీసీసీ అధికారులు మాట్లాడుతూ... జీసీసీ పరిధిలోని 658 పార్కులను మూడు ప్రైవేటు సంస్థలకు ఏడాది ఒప్పంద ప్రాతిపదికన అప్పగించినట్లు, అందుకోసం ప్రైవేటు సంస్థలకు జీసీసీ ఏడాదికి రూ.80 కోట్లు చెల్లిస్తుందని అధికారులు తెలిపారు.

### 28 వరకు అర్బన్ ప్లానింగ్ డివిజన్ ఆన్‌లైన్ సర్వీసులు రద్దు

పెరంబూర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): చెన్నై కార్పొరేషన్ అర్బన్ ప్లానింగ్ డివిజన్ ఆన్‌లైన్ సేవలు శనివారం ఉదయం 6 నుంచి 28వ తేది ఉదయం 6 గంటల వరకు నిలిపివేయనున్నట్లు కార్పొరేషన్ ఒక ప్రకటనలో తెలిపింది. ఆన్‌లైన్ సేవల వినియోగం, భద్రత, లభ్యత తదితరాలు పెంచేలా ఆధునికీకరణ, జీసీసీ సేవలను రాష్ట్ర డేటా సెంటర్‌కు అనుసంధానం చేయడం తదితర పనుల కారణంగా ఈ సేవలు నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

### సహకార శాఖ నుంచి క్రెడిట్ కార్డులు ?

పెరంబూర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సహకార శాఖ వినియోగదారులకు 'క్రెడిట్ కార్డు' అందించేందుకు అనుమతి కోరుతూ రిజర్వ్ బ్యాంక్‌కు దరఖాస్తు చేసుకుంది. ప్రస్తుతం ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులు క్రెడిట్ కార్డులు ఇస్తున్నాయి.సహకారశాఖను అభివృద్ధి చేసేందు కు పలు చర్యలు చేపట్టారు. ఈ విషయమై సహకార శాఖ అధికారులు మాట్లాడుతూ... తమ శాఖ తరఫున క్రెడిట్ కార్డులు అందించేందుకు అనుమతించాలని రిజర్వ్ బ్యాంక్‌కు దరఖాస్తు చేసుకున్నామన్నారు. వినియోగదారుల అవసరాల మేరకు రుణం అందించనున్నామన్నారు. ఈ కారణంగా నగదు బదిలీ పెరగడంతో పాటు వడ్డీ ద్వారా ఆదాయం చేకూరుతుందని వారు పేర్కొన్నారు.

### 29 నుంచి యూట్యూబ్ ఛానల్ ప్రారంభంపై శిక్షణ

పెరంబూర్, జూలై25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అభివృద్ధి,శిక్షణాసంస్థ ఆధ్వర్యంలో యూట్యూబ్ ఛానల్ ప్రారంభంపై మూడు రోజులు శిక్షణ ఇవ్వనున్నారు. ఛానల్ ప్రారంభం, వీడియో, స్లైడ్ షో తయారీ, మార్కెటింగ్ సహా పలు అంశాలపై శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులై 18 ఏళ్లు పైబడిన వారు శిక్షణలో పాల్గొనవచ్చు. ఈకాట్టుతాంగళ్‌లోని సంస్థ ప్రాంగణంలో ఈ నెల 29 నుంచి 31వ తేది వరకు శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు. తక్కువ అద్దెతో పురుషులు, మహిళలకు వేర్వేరుగా బస వసతి కల్పిస్తారు. వివరాలకు 9543773337, 9360221280 అనే నెంబర్లు సంప్రదించవచ్చు.

### 'కెప్టెన్ రథయాత్ర'కు అనుమతించండి

పెరంబూర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): డీఎండీకే ఆధ్వర్యలో 'కెప్టెన్ రథయాత్ర' పేరుతో చేపట్టనున్న ప్రచారానికి అనుమతించాలని కోరుతూ ఆ పార్టీ కోశాధికారి ఎల్కే సుధీష్ డీజీపీ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఆగస్టు 3వ తేది నుంచి పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రేమలత తిరువళ్లూర్ తూర్పు నియోజకవర్గం నుంచి రాష్ట్రవ్యాప్త ప్రచారం చేపట్టనున్నారు. దీకిఇ అనుమతించాలని కోరుతూ డీజీపీ కార్యాలయంలో డీఎండీకే శుక్రవారం వినతిపత్రం సమర్పించింది.

## వైగోకు వ్యతిరేకంగా 2న నిరాహారదీక్ష

● ఎండీఎంకే ఉప ప్రధాన కార్యదర్శి మల్లైసత్య

ప్యారీస్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగోకు వ్యతిరేకంగా ఆగస్టు 2వ తేదీ నగరంలో నిరాహారదీక్ష చేపట్టనున్నట్లు ఆ పార్టీ ఉప ప్రధాన కార్యదర్శి మల్లైసత్య శుక్రవారం ప్రకటించారు. ఇటీవల ఎగ్మూర్‌లోని ఎండీఎంకే ప్రధాన కార్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో వైగో ప్రసంగిస్తూ ఎల్టీటీఈ నేత ప్రభాకరన్‌కు ఆయన అనుచరుడు మాతయ్య ద్రోహం చేసినట్లు, తనతో పలు పోరాటాల్లో పాల్గొన్న మల్లైసత్య కూడా ద్రోహం తలపెట్టినట్లు ఆరోపించారు. తనపై నిందమోపిన వైగోకు కౌంటర్ ఇచ్చేలా వైగో, ఆయన కుమారుడు, ఎంపీ దురైవైగో వైగో పట్ల తాను చూపించిన విశ్వాసం, పార్టీ అభివృద్ధికి ఖర్చుచేసిన తన సొంత నిధుల వివరాలను ప్రజల వద్దకు చేర్చేవిధంగా నిరాహారదీక్ష చేపట్టనున్నట్లు మల్లైసత్య తెలిపారు.

# మేట్టూరు డ్యాం పరిశీలన



డ్యాంలోని అండర్ వాల్‌ను పరిశీలిస్తున్న భద్రతా కమిటీ

పెరంబూర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మేట్టూరు డ్యాంను తమిళనాడు నదుల భద్రతా కమిటీ గురువారం పరిశీలించింది. మేట్టూరు దిగువ ప్రాంతం, సొరంగ కాలువల మరమ్మతు, క్రస్ట్‌గేట్లు, తూముల పటిష్ఠత పనులు జరుగుతున్నాయి. ఈ పనులను ఐఐటీ ప్రొఫెసర్ల బృందం పర్యవేక్షిస్తూ సూచనలు చేస్తోంది.. ఈ క్రమంలో, మేట్టూరు డ్యాంను రాష్ట్ర నదుల భద్రత కమిటీ పర్యవేక్షణ ఇంజనీర్ కార్తికేయన్ నేతృత్వంలోని 10 మంది ఇంజనీర్లు, అధికారులతో కూడిన బృందం పరిశీలించింది. ఐదేళ్లకు ఒకసారి తనిఖీలు చేపడుతుంటామని, ఆ నివేదికను రాష్ట్ర ప్రభుత్వం, జలవనరుల శాఖకు అందించనున్నట్లు కార్తికేయన్ తెలిపారు.

● సాత్తాన్‌కుళం లాకప్‌డెత్ కేసు ....

# సీఐ శ్రీధర్ అప్రూవర్ పిటిషన్‌పై సీబీఐ అభ్యంతరం



సీఐ శ్రీధర్‌ను కోర్టుకు తీసుకెళుతున్న పోలీసులు

టి.నగర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): సాత్తాన్‌కుళం తండ్రీకొడుకుల హత్యకేసులో నిందితుడిగా ఉన్న సీఐ శ్రీధర్ ప్రభుత్వ తరఫు సాక్షిగా (అప్రూవర్) మారేందుకు చేస్తున్న ప్రయత్నాలపై సీబీఐ అభ్యంతరం తెలిపింది. తూత్తుకుడి జిల్లాలోని సాత్తాన్‌కుళంలో 2020 జూన్ 19, కరోనా లాక్‌డౌన్ ఆంక్షలు అమలులో ఉన్న సమయంలో జయరాజ్, అతడి కుమారుడు ఫినిక్స్‌ను పోలీసులు అక్రమంగా నిర్బంధించి, దారుణంగా హతమార్చారు. ఈ కేసులో సాత్తాన్‌కుళం పోలీసుస్టేషన్ సీఐ శ్రీధర్, ఎస్‌ఐలు బాలకృష్ణన్, రఘుగణేష్, హెడ్ కానిస్టేబుల్ మురుగన్, కానిస్టేబుళ్లు ముత్తురాజ్, చెల్లదురై, థామస్ ఫ్రాన్సిస్, వెయిల్‌ముత్తు సహా 9 మందిని అరెస్టు చేశారు. ఈ కేసు విచారణ నాలుగు సంవత్సరాలకు పైగా మదురై జిల్లా ఫస్ట్ సెషన్స్ కోర్టులో కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో సీఐ శ్రీధర్ అప్రూవర్‌గా మారేందుకు అనుమతించాలని కోరుతూ కోర్టులో పిటిషన్ వేశారు. సాత్తాన్‌కుళం కేసులో దోషులకు శిక్షపడేలా తాను అప్రూవర్‌గా మారదలిచానని, అందుకు అనుమతివ్వాలని కోరారు. ఆ పిటిషన్‌కు కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని కోర్టు సీబీఐకి ఉత్తర్వు జారీ చేసింది. సీఐ శ్రీధరన్ సమర్పించిన పిటిషన్ మేజిస్ట్రేట్ ముత్తుకుమరన్ ఎదుట విచారణకు వచ్చింది. నిందితుడు సీఐ శ్రీధరన్‌ను భారీ భద్రత నడుమ పోలీసులు కోర్టుకు తీసుకువచ్చారు. అప్రూవర్‌గా మారతానన్న సీఐ శ్రీధరన్‌కు అనుమతివ్వకూడదని, లాకప్ డెత్‌లో తన భర్తను చిత్రహింసలు పెట్టిన ప్రధాన వ్యక్తి ఆయనే గనుక పిటిషన్‌ను తోసిపుచ్చాలని జయరాజ్ భార్య సెల్వరాణి తరఫు న్యాయవాది వాదించారు. సీబీఐ తరఫున హాజరైన న్యాయవాదులు కూడా సీఐ శ్రీధరన్‌ను అప్రూవర్‌గా మార్చేందుకు అనుమతించకూడదని వాదనలు వినిపించారు. ాద ప్రతివాదనలను పరిశీలించిన మీదట మేజిస్ట్రేట్ ఈ నెల 28కి విచారణ వాయిదా వేశారు.

### మాజీ ఎమ్మెల్యేలకు మెడికల్ అలెవెన్స్‌గా రూ.లక్ష

ప్యారీస్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలకు ఇచ్చే మెడికల్ అలెవెన్స్ రూ.75వేలను రూ.లక్షకు పెంచారు. ఈ మార్పుకు సంబంధించిన జీవోను కూడా శుక్రవారం ప్రభుత్వం విడుదల చేసింది. ఎమ్మెల్యేలకు, 1986 వరకు ఎమ్మెల్సీలుగా పనిచేసిన ప్రజాప్రతినిధులకు ప్రతి ఆర్థిక సంవత్సరంలో మెడికల్ అలెవెన్స్‌గా రూ.75వేలు ఇస్తున్నారు.. ప్రస్తుతం దీనిని 1982 రాష్ట్రప్రభుత్వ హక్కుల సవరణ చట్టం కింద రూ.లక్షకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిందని సచివాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

### ప్రభుత్వంలో భాగస్వామ్యం కోరం...!

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి షణ్ముగం

పెరంబూర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): సీపీఎం ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పాటైతే తప్ప, వేరే ఏ పార్టీ నేతృత్వంలోని ప్రభుత్వంలో తాము భాగస్వామ్యం కోరమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి షణ్ముగం స్పష్టం చేశారు. రామనాథపురంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... పార్లమెంటు సమావేశాల సమయంలో విదేశీ పర్యటనకు వెళ్లడాన్ని ఖండిస్తున్నామన్నారు. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి, తమ కూటమిలోకి రావాలంటూ ఆహ్వానం పలికినా, పార్టీలు స్పందించకపోవడంతో, ఆయన రోజుకొక మాట మారుస్తున్నారన్నారు. బీజేపీతో అన్నాడీఎంకే జతకట్టడంతో ఆ కూటమిలో చేరేందుకు ఏ పార్టీ సిద్ధంగా లేదని షణ్ముగం తెలిపారు.

### ప్రభుత్వ పాఠశాలల్లో కరాటే, శిలంబం శిక్షణకు రూ.15.5 కోట్లు



టి.నగర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో కరాటే, జూడో, టేక్వాండో, సిలంబరం వంటి ఆత్మరక్షణ కళలపై విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం కోసం ప్రభుత్వం రూ.15.5 కోట్ల మేర నిధులు విడుదల చేసింది. ఆరో తరగతి నుండి ప్లస్-2 చదివే విద్యార్థులకు శిక్షణ అందించనున్నారు. రాష్ట్రంలోని 6045 ప్రభుత్వ మాధ్యమిక పాఠశాలల్లో 6 నుండి 8 తరగతుల వరకు విద్యార్థులకు ఆత్మరక్షణ కళలపై శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేక శిక్షకులను నియమించనున్నారు. వీరికి నెలకు రూ.3వేల చొప్పున మూడు మాసాలకు రూ.12వేల గౌరవ వేతనం చెల్లించనున్నారు. వీరి వేతనాల కోసం రూ.7.25 కోట్లు కేటాయించారు. ఇదే విధంగా 5804 ఉన్న, మహోన్నత పాఠశాలల్లో విద్యార్థులకు శిక్షణ లందించటానికి రూ.8.23 కోట్ల మేరకు నిధులు కేటాయించారు. వారానికి 2 రోజులు చొప్పున మూడు నెలలకు 24 శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు.

### తిరువణ్ణామలైలో రూ.64.30 కోట్లతో విడిది గృహాలు

పెరంబూర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై గిరి ప్రదక్షిణ మార్గంలో భక్తుల సౌకర్యార్థం రూ.64.30 కోట్లతో విడిది గృహాల ఏర్పాటుకు ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించింది. గిరి ప్రదక్షిణ మార్గంలోని సోనానది గార్డెన్ సమీపంలో నాలుగు అంతస్తుల్లో నిర్మించే విడిది గృహంలో, ఇద్దరుండేలా 128 గదులు, ఆరుగురుండేలా 24గదులు, పదిమంది బసచేసేలా ఆరు గదులు ఏర్పాటుకానున్నాయి. అలాగే, సర్వీస్ అపార్ట్‌మెంట్లుగా ఆరు విల్లాలున్నాయి. అలాగే, గిరి ప్రదిక్షిణ మార్గంలో రూ.22.11 కోట్లతో 213 చోట్ల 213 మరుగుదొడ్లు, 52 స్నానపు గదులు, దివ్యాంగుల కోసం 24 మరుగుదొడ్లు నిర్మించనున్నారు. 550 మంది సామర్థ్యంతో 7 ప్రదేశాల్లో విశ్రాంతి మందిరాలు ఏర్పాటుచేయనున్నట్లు, త్వరలో నిర్మాణపనులు ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

## డీఎంకే కూటమిలోనే కొనసాగుతాం

● డీపీఐ అధ్యక్షుడు తిరుమా

పెరంబూర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): డీఎంకే కూటమిలోనే పయనిస్తున్నామని, చిన్నచిన్నగా బలోపేతమవుతూ ాష్ట్ర పార్టీగా అవతరించామని డీపీఐ అధ్యక్షుడు తిరుమావళవన్ తెలిపారు. నగరంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... అన్నాడీఎంకేను బీజేపీ బలహీన పరుస్తుందని తాము పదేపదే చెబుతున్నామని, ఈ వ్యవహారంలో అన్నాడీఎంకే అప్రమత్తంగా ఉండాలని సూచించామన్నారు. కానీ,డీఎంకే కూటమి నుంచి డీపీఐ వైదొలుగుతుందని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కూటమిలో చేరాల్సిన పరిస్థితులను బట్టి పళనిస్వామి మాట్లాడుతున్నారని తాము అర్థం చేసుకున్నట్లు తిరుమావళవన్ తెలిపారు.

## గాంధీ మనవడు కమల్‌హాసన్?

కోవైలో ఎంఎన్‌ఎం పోస్టర్ కలకలం




కోవైలో ఎంఎన్‌ఎం నాయకులు కమల్‌ను అభినందిస్తూ అతికించిన పోస్టర్

టి.నగర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మక్కల్ నీది మయ్యం (ఎంఎన్‌ఎం) నాయకుడు కమల్‌హాసన్ శుక్రవారం రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేయనున్న సందర్భంగా కోయంబత్తూరులో ఆ పార్టీ నేతలు అతికించిన పోస్టర్ కలకలం సృష్టిస్తోంది. ఆ పోస్టర్‌లో కమల్‌ను గాంధీ మనవడుగా పేర్కొనటం చర్చనీయాంశమైంది. ఆ పోస్టర్‌లో కేంద్ర ప్రభుత్వానికి గమనిక! మీ కోటలోకి గాంధీ మనవడు డాక్టర్ కమల్ వస్తున్నారహో అంటూ ముద్రించి ఉంది. ప్రస్తుతం ఈ పోస్టర్ సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలలో తీవ్రంగా వైరల్ అవుతోంది.

## బీజేపీ నేత ఆత్మహత్య కేసులో ముగ్గురి అరెస్టు



అరెస్టయిన గోల్డ్‌గోపాల్, షణ్ముగసుందరం, విజయరాఘవన్ (ఫైల్‌ఫొటో)

చెన్నై, జూలై 25 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి జిల్లా మణప్పారైలో బీజేపీ నాయకుడి ఆత్మహత్య కేసులో ఆ పార్టీకి చెందిన ఇద్దరు సహా ముగ్గురు అరెస్టయ్యారు. మణప్పారై గాంధీనగర్‌కు చెందిన పాండ్యన్ (45) ఎలక్ట్రానిక్స్ వస్తువుల దుకాణం నడుపుతున్నారు. బీజేపీ నగర శాఖ డిప్యూటీ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం పాండ్యన్ అప్పావు వీధిలోని తన కార్యాలయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సమాచారం అందుకుని పోలీసులు హుటాహుటిన అక్కడికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టంకు పంపారు. అదే సమయంలో పాండ్యన్ ఆత్మహత్యకు బీజేపీ స్థానిక నాయకులు ఎస్.గోపాలకృష్ణన్ అలియాస్ గోల్డ్ గోపాల్ (45), షణ్ముగసుందరం (41) అన్నాడీఎంకే ఎంజీఆర్ పేరవై నాయకుడు విజయరాఘవన్ (44) కారణమంటూ పాండ్యన్ భార్య జ్ఞానసౌందరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు పోలీసులు విచారణ ప్రారంభించి ఆ ముగ్గురిని అరెస్టు చేసిన మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచి తిరుచ్చి సెంట్రల్ జైలుకు తరలించారు.

● ట్రాన్స్‌ఫార్మర్ల కేసు...

## సెంథిల్ బాలాజీకి హైకోర్టు నోటీసు

పెరంబూర్, జూలై 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ట్రాన్స్‌ఫార్మర్ల కొనుగోళ్లకు సంబంధించి టెండర్ల కేటాయింపులో రూ.397 కోట్ల మేర అవినీతి జరిగిందనే కేసులో అవినీతి నిరోధక శాఖ, మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ తదితరులు నాలుగు వారాల్లో అఫిడవిట్లు దాఖలుచేయాలని మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రంలో 2021-23 సంవత్సరాల్లో 45,800 ట్రాన్స్‌ఫార్మర్ల కొనుగోలుకు రూ.1,068కోట్ల మేర టెండర్లు ఆహ్వానించారని,ఈ టెండర్ల కేటాయింపులో రాష్ట్ర ప్రభుత్వానికి రూ.397 కోట్లు నష్టం వాటిల్లిందంటూ, మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ సహా పలువురికి వ్యతిరేకంగా అన్నాడీఎంకే న్యాయవాద విభాగం సంయుక్తకార్యదర్శి ఇ.శరవణన్ మేనెలలో అవినీతి నిరోధక శాఖ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై కేసు నమోదుచేసేలా అవినీతి నిరోధక శాఖకు ఉత్తర్వులు జారీచేయాలని, ప్రత్యేక విచారణ కమిటీ ఏర్పాటుచేసి విచారించాలని కోరుతూ శరవణన్ మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ శుక్రవారం విచారించిన న్యాయమూర్తి జస్టిస్ వేల్‌మురుగన్ ఈ కేసులో రాష్ట్ర ఏసీబీ డైరెక్టర్, తమిళనాడు విద్యుదుత్పత్తి, పంపిణీ సంస్థ, మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ నాలుగు వారాల్లో అఫిడవిట్లు దాఖలుచేయాలని ఉత్తర్వులు జారీచేశారు. అలాగే, ఈ వ్యవహారంపై అరప్పోర్ ఇయక్కం దాఖలుచేసిన పిటిషన్‌ను ఈ పిటిషన్ విచారణ జాబితాలో చేర్చాలని న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు.

## ఆసనూరులో ఏనుగు సంచారం

● భీతిల్లుతున్న వాహన చోదకులు



ఆసనూరు రహదారిలో సంచరిస్తున్న ఏనుగు

చెన్నై, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ జిల్లా సత్యమంగళం సమీపంలోని ఆసనూరు అటవీ ప్రాంతానికి చేరువగా ఉన్న రహదారిపై ఓ అడవి ఏనుగు సంచరిస్తుండటంతో వాహన చోదకులు భయాందోళనకు గురవుతున్నారు. ఆసనూరు సమీపంలోని పులుల అభయారణ్యంలో అడవి ఏనుగులు ఎక్కువగా సంచరిస్తుంటాయి. ఆసనూరు రహదారిలో తరచూ చెరకు లారీలు వెళ్తుండడంతో చెరకుగడల కోసం ఏనుగులు అడవి నుంచి బయటకు వస్తున్నాయి. ఇటీవల ఆ రహదారిలో వెళుతున్న చెరకు లారీని ఏనుగు అడ్డగించి చెరకు గడలను ఆరగించింది. అప్పటి నుండి ఆ ఏనుగు తరచూ ఆ రహదారిలో సంచరిస్తోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం ఆ ఏనుగు మళ్ళీ ఆ రహదారిపై చెరకులోడు లారీల కోసం ఎదురు చూస్తూ అడ్డదిడ్డంగా తిరిగింది. ఆ ఏనుగును చూసి వాహన చోదకులు భయాందోళనకు గురై వాహనాలను ఆపకుండా వెళ్ళారు. ఆ ఏనుగును అడవిలోకి తరిమికొట్టేందుకు అటవీ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## మున్సిపాలిటీ సమస్యలపై అన్నాడీఎంకే నేతల ఆందోళన



నిరసన చేస్తున్న అన్నాడీఎంకే నేతలు

తిరుత్తణి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణిలో రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో కాలువలు నిండి రోడ్లపైకి వస్తున్నాయి. కాలువల్లో పూడికతీత చేపట్టకపోవడంలో మురుగునీరు ఇళ్లలోకి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. దీనిపై స్పందించిన అన్నాడీఎంకే నగర కార్యదర్శి సౌందర్యరాజన్ ఆ వార్డు కార్యదర్శి రామస్వామి, అన్నాడీఎంకే కార్యకర్తలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సౌందర్యరాజన్ మాట్లాడుతూ, వర్షాకాలం వస్తే అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వర్షం కురినప్పుడల్లా కొండపై నుండి వచ్చే నీటి వల్ల కింద ప్రాంతాలు జలమయమవుతున్నాయిన గత ఏడాది కాలంగా తిరుత్తణి మున్సిపల్ అధికారులకు ఫిర్యాదుజేస్తున్నా.. పట్టించుకోవడంలేదని తెలిపారు. అనంతరం అధికారులు నిర్లక్ష్యంపై నిరసిస్తూ రోడ్డుపై బైటాయించి నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు, తహసీల్దార్ మలర్విళి ఘటన స్థలానికి చేరుకుని వారితో చర్చించి, త్వరలోనే ఈ సమస్యకు పరిష్కారం చూపుతామన్న హామీతో పార్టీశ్రేణులు ఆందోళన విరమించుకున్నారు.

## కళాశాల విద్యార్థి అవయవదానం



హేమ్‌నాథ్ (ఫైల్‌ఫొటో)

పెరంబూర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మెదడు నిర్జీవమైన కళాశాల విద్యార్థి, తన అవయవదానంతో మరికొందరికి పునర్జన్మ ప్రసాదించాడు. స్థానిక అంబత్తూర్ కల్లికుప్పం ముత్తమిళ్ నగర్‌కు చెందిన హేమ్‌నాథ్ (18) నెర్‌కుండ్రంలోని ఓ కళాశాలలో బి.కాం రెండో సంవత్సరం చదువుతున్నాడు. హేమ్‌నాథ్ ఈ నెల 21న తన స్కూటర్‌లో పట్టాభిరాం రైల్వేస్టేషన్ నుంచి కల్లికుప్పం వైపు వెళ్తుండగా, చెన్నై బైపాస్ సర్వీస్ రోడ్డులో ఎదురుగా వస్తున్న సరకుల వాహనాన్ని ఢీకొన్నాడు.ఈఘటనలో తీవ్రంగా గాయపడిన అతడిని స్టాన్లీ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మూడు రోజులుగా చికిత్స పొందుతున్న హేమ్‌నాథ్ గురువారం మెదడు నిర్జీవమైనట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల అనుమతితో, హేమ్‌నాథ్ అవయవాలు వెలికితీసిన వైద్యులు, అవసరమైన వారికి అమర్చనున్నట్లు తెలిపారు. హేమ్‌నాథ్ భౌతికకాయానికి వైద్యులు,నర్సులు, సిబ్బంది నివాళులర్పించారు.

## విద్యార్థినులపై లైంగిక వేధింపులు

● హెచ్‌ఎం అరెస్ట్

పెరంబూర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన హెచ్‌ఎంను పోలీసులు అరెస్ట్ చేశారు. కన్నియాకుమారి జిల్లా కులశేఖరంలోని ఉన్నత పాఠశాలలో రమేష్‌కుమార్ (58) హెచ్‌ఎంగా వ్యవహరిస్తున్నారు. పాఠశాలలో కొందరు విద్యార్థినులపై హెచ్‌ఎం లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్లు సమాచారం. అతని వేధింపులు తట్టుకోలని విద్యార్థినులు తల్లిదండ్రులకు తెలిపారు. జిల్లా ప్రధాన విద్యాధికారి, కలెక్టర్‌కు విద్యార్థినుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై అధికారులు చేపట్టిన విచారణలో లైంగిక వేధింపులు వాస్తవమని తెలిసింది. ఓ బాలిక తల్లి ఫిర్యాదుతో, మార్తాండం పోలీసులు హెచ్‌ఎంను పోక్సో చట్టం కింద అరెస్ట్ చేశారు.

## వైద్యుడి ఇంట్లో 158 సవర్ల చోరీ

పెరంబూర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కడలూరు సమీపంలో ప్రభుత్వ వైద్యుడి ఇంట్లో 158 సవర్ల నగలు చోరీ జరగడం కలకలం రేపింది. విల్లుపురం ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రిలో వైద్యుడిగా పనిచేస్తున్న రాజా కడలూరు జిల్లా బన్రూటిలోని పుదుపిళ్లయార్‌కుప్పం ప్రాంతంలో నివసిస్తున్నారు. ఆయన భార్య ఆర్తీ కూడా వైద్యురాలే.. రాజా గురువారం ఉదయం ఇంటికి తాళం వేసి విధులకు వెళ్లారు. రాత్రి తిరిగి రాగా తలుపులు బద్దలుకొట్టి ఉండడం చూసి దిగ్భ్రాంతి చెంది, వెంటనే ఇంట్లో వెళ్లి చూడగా, బీరువాలోని 158 సవర్ల నగలు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఆయన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి విచారిస్తున్నారు.

## రైతు హత్యకేసులో ముగ్గురికి జీవిత ఖైదు

పెరంబూర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా ఊత్తుకోటలో జరిగిన రైతు హత్యకేసులో కోర్టు ముగ్గురికి జీవిత ఖైదు విధించింది. 2014లో పాతకక్షల కారణంగా ఆనందన్ అనే రైతు హత్యకు గురయ్యాడు. ఈ కేసులో దశరథన్, కుమార్, కుమరేశన్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసు విచారణ తిరువళ్లూర్ జిల్లా కోర్టులో ముగిసిన నేపథ్యంలో, నేరారోపణ రుజువు కావడంతో ముగ్గురిని జీవిత ఖైదు, తలా రూ.40 వేల జరిమానా విధిస్తూ కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించింది.

## పసికందు విక్రయం కేసులో ముగ్గురి అరెస్ట్

పెరంబూర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పసికందు విక్రయం కేసులో ముగ్గురు మహిళలను పోలీసులు అరెస్ట్ చేశారు. నగరానికి చెందిన కార్తీక్‌ను ఫోన్‌లో సంప్రదించిన ఓ మహిళ, మగబిడ్డ విక్రయానికి ఉందని, రూ.12 లక్షలు ఇవ్వాలని కోరింది. దీంతో దిగ్భ్రాంతి చెందిన కార్తీక్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు ఆ మహిళను కార్తిక్ ద్వారానే గుర్తించాలని నిర్ధారించారు. కార్తీక్ ఆ మహిళను ఫోన్‌లో సంప్రదించగా, బిడ్డను విక్రయించే మహిళకు రూ.10 లక్షలు, ఏజెంట్‌గా తనకు రూ.2 ఇవ్వాలని తెలిపింది. డబ్బు ఎక్కడకు తీసుకురావాలని కార్తీక్ కోరగా, పుళల్ ప్రాంతానికి రావాలని సూచించింది. దీంతో, కార్తీక్‌తో వెళ్లిన పోలీసులు సమీపంలో దాక్కున్నారు. స్కూటర్ వచ్చిన ఆ మహిళ చేతుల్లో మగబిడ్డ ఉంది. పోలీసులు ఒక్కసారిగా ఆమెను చుట్టుముట్టి అదుపులోకి తీసుకున్నారు. విచారణలో, ఆమె పేరు విద్య అని, పిల్లలను విక్రయించే ఏజెంట్‌గా పనిచేస్తున్నట్లు తెలిసింది. అనంతరం విద్య ఇంట్లో తనిఖీలు చేపట్టిన పోలీసులు, బిడ్డ తల్లి, మరో మహిళను అదుపులోకి తీసుకుని, ఆ ఇంట్లో మరో ఇద్దరు పసికందులను రక్షించారు. విద్య సెల్‌ఫోన్‌లో పెద్ద సంఖ్యలో చిన్నపిల్లల ఫొటోలుండడంతో, ఆమె పిల్లలను విక్రయిస్తోందా? ఈ వ్యవహారంలో మరెవరైనా ఉన్నారా? అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు.

## కెమికల్ బాయిలర్‌లో ఎగసిపడిన మంటలు

● కళ్ల మంటలతో ప్రజల ఇబ్బందులు

ప్యారీస్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరువొత్తియూర్ రామలింగ స్వామి మఠం సమీపంలోవున్న పాత ఇనప సామగ్రి గోదాములో కెమికల్ బాయిలర్‌లో శుక్రవారం ఉదయం మంటలు ఎగసిపడ్డాయి. పొగ దట్టంగా వ్యాపించడంతో కళ్లమంటలతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పాత ఇనప సామగ్రి గోదాములో ప్లాస్టిక్, అల్యూమినియం, పరిశ్రమల నుంచి సేకరించిన పరికరాలను భద్రపరిచి యజమాని సోమసుందరం హోల్‌సేల్‌గా విక్రయిస్తుంటారు. సంఘటన రోజు ఉదయం ఆ గోదాములోవున్న కెమికల్ బాయిలర్‌లో హఠాత్తుగా మంటలు చెలరేగి పొగలు వ్యాపించాయి. ఊపిరి పీల్చుకోలేక ఇబ్బంది పడిన ప్రజలు అందించిన సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపుచేశారు. తిరువొత్తియూర్ పోలీసులు దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఘనంగా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చక్రవర్తి జన్మదిన వేడుకలు



భక్తులకు ప్రసాదాలు పంపిణీచేస్తున్న బీజేపీ నిర్వాహకులు

తిరుత్తణి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.చక్రవర్తి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ శ్రేణులు వేడుకలు జరిపారు. ఈ నేపథ్యంలో, తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టులోని కొల్లాపురి అమ్మన్ ఆలయంలో పళ్లిపట్టునార్త్ యూనియన్ బీజేపీ అధ్యక్షుడు కిరణ్‌కుమార్ శుక్రవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి,ఆలయానికివచ్చిన భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ, అమ్మవారి కృపతో త్వరలో రాష్ట్రంలో బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడాలని కోరినట్లు ఆయన తెలిపారు.

## శివలింగానికి క్షీరాభిషేకం



పెరంబూర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): నన్నిలం అంకాళమ్మ అమ్మవారి ఆలయంలో ఆడి అమావాస్య వేడుకలు వైభవంగా జరిగాయి. తిరువారూర్ జిల్లా తెన్‌కుడి అంకాళిపురంలోని అంకాళమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఐదు నాగుపాముల తలలతో కూడిన 35 అడుగుల ఎత్తున భారీ శివలింగం ఉంది. ఆడి అమావాస్య సందర్భంగా భక్తులు గురువారం తిరుమలై రాజన్ నది తీరం నుంచి పాల కలశాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం ఆలయ పూజారులు భారీ శివలింగానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ వేడుకల్లో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనగా, ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు, అన్నదానం నిర్వహించారు.

### చోరీ కేసులో ముగ్గురి అరెస్ట్

ప్యారీస్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లా విక్రవాండి సమీపంలో లారీ డ్రైవర్ కళ్లలో కారం చల్లి రూ.10 లక్షలు దోచుకున్న ముగ్గురిని శుక్రవారం అరెస్టు చేసి వారి నుంచి రూ.9.50 లక్షల నగదు, ఓ కారు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మాధవరం ప్రాంతంలో కోడిగుడ్ల వ్యాపారి సెల్వరాజ్ నామక్కల్‌లోని కోళ్ళ ఫారాల నుంచి గుడ్లు కొనుగోలు చేస్తుంటారు. గుడ్ల కొనుగోలు కోసం తమ లారీ డ్రైవర్ సప్తగిరికి రూ.10 లక్షలు ఇచ్చి పంపారు. బుధవారం తెల్లవారుజామున సప్తగిరి లారీని విక్రవాండి టోల్‌గేట్ సమీపంలో నిలపగా, కారులో వెళ్లిన ఇద్దరు వ్యక్తులు అతడి కళ్లలో కారం కొట్టి నగదును దోచుకుని వెళ్ళారు. దీనిపై అందజేసిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి విచారణ జరపగా దుండగుల ఆచూకీ తెలిసింది. దీంతో డీఎస్పీ శరవణన్ నేతృత్వంలోని పోలీసుల బృందం ఏవీపీ పౌల్ట్రీ డ్రైవర్‌గా పనిచేసిన తిరునల్వేలికి చెందిన ప్రవీణ్ కోవిల్‌రాజ్ (32), సతీష్ (40), ముత్తుకుమార్ (40)లను శుక్రవారం ఉదయం అరెస్టు చేసి, రూ.9.50 లక్షల నగదు ఓ కారును స్వాధీనం చేసుకుని కోర్టు ఉత్తర్వుల మేరకు రిమాండ్‌కు తరలించారు.

## హీరో సూర్య గొప్ప మనసు!



అగ్ర హీరో సూర్య గత పదేళ్ళగా నిశ్శబ్దంగా ఓ గొప్ప పనిచేస్తున్నారు. ఈ విషయాన్ని తాజాగా స్టంట్ మాస్టర్ సిల్వా వెల్లడించారు. సూర్య తాజాగా తన 50వ పుట్టిన రోజు వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చేస్తున్న గొప్పపనిని సిల్వ వెల్లడించారు. 'తమిళ చిత్రపరిశ్రమలో ఉండే స్టంట్ మాస్టర్లకు పదేళ్ళుగా బీమా సౌకర్యం కల్పిస్తున్నారు. ఇందుకోసం ఆయన ప్రతి యేటా రూ.10 లక్షల చొప్పున ప్రీమియం చెల్లిస్తున్నారు' అని స్టంట్ మాస్టర్ సిల్వ తెలిపారు. అదేవిధంగా అగరమ్ ఫౌండేషన్ తరపున అనేక మంది పేద విద్యార్థులకు విద్యాదానం చేస్తున్న విషయం తెల్సిందే. కాగా, ఇటీవల స్టంట్ ఆర్టిస్ట్ రాజు హైరిస్క్ స్టంట్ చేస్తూ ప్రాణాలు కోల్పోయిన విషయం తెల్సిందే.

# మూస ధోరణిలో సినిమాలు

● మన్సూర్ అలీఖాన్



పాటినీ కుమార్, దర్శన్, వీఆర్‌వీ కుమార్, గౌతమ్ గణపతి

ఇపుడు వస్తున్న చిత్రాలన్నీ ఒకే తరహాలోలో ఉంటున్నాయని, వాటికి భిన్నంగా దర్శకుడు గౌతమ్ గణపతి 'సరెండర్' చిత్రాన్ని తెరకెక్కించారని ప్రముఖ నటుడు మన్సూర్ అలీఖాన్ కొనియాడారు. ఈ చిత్ర ఆడియో, ట్రైలర్ రిలీజ్ తాజాగా నగరంలో జరిగింది. ఈ కార్యక్రమంలో మన్సూర్ అలీఖాన్ మాట్లాడుతూ, 'ఈ సినిమాలో నేను ఓ ముఖ్య పాత్ర పోషించాను. ఇపుడు వస్తున్న చిత్రాలకు భిన్నంగా ఈ సినిమా ఉంది. నిర్మాత అమెరికా నుంచి వచ్చి సినిమా తీయడం అభినందనీయమన్నారు. దర్శకుడు గౌతమ్ గణపతి మాట్లాడుతూ, 'ప్రముఖ దర్శకుడు అరివళగన్ శిష్యుడిగా చేసిన తనకు దర్శకుడిగా ఇది తొలి చిత్రం. కథ డిమాండ్ చేయంకపోవడంతో పాటలు లేకుండానే తీశాం. ఈ సినిమా కెమెరామెన్, ఎడిటర్, సంగీత దర్శకుడు, నేను, ఇంకా చాలమంది అరివళగన్ వద్ద పనిచేశాం. త్రిల్లర్ మూవీతో వస్తున్నాం. విజయం కోసం మీడియా సపోర్టు చేయాలని కోరారు. హీరో దర్శన్ మాట్లాడుతూ, 'బిగ్‌బాస్ నుంచి ఇప్పటివరకు మీడియా ఎంతో అండగా ఉంది. ఆ కారణంగానే ఇక్కడ ఉన్నాను. మన్సూర్ అలీ ఖాన్ వంటి సీనియర్ నటులతో కలిసి పనిచేయడం ఆనందంగా ఉంది. ఈ సినిమా కోసం ప్రతి ఒక్కరూ ఎంతగానో శ్రమించారన్నారు. దర్శకుడు అరివళగన్ మాట్లాడుతూ, 'ఈ సినిమా యూనిట్‌లో చాలా మంది నా దగ్గర పనిచేసిన వారే. . మూవీ ట్రైలర్ చిత్రాన్ని చూడాలన్న ఆసక్తిని కలిగిస్తోంది. చిత్ర బృందానికి, నిర్మాతకు అభినందనలు తెలిపి సినిమా సక్సెస్ సాధించాలని ఆశీర్వదించారు. కాగా, అప్‌బీట్ పిక్చర్స్ పతాకంపై వీఆర్‌వీ కుమార్ నిర్మాణంలో నూతన దర్శకుడు గౌతమ్ గణపతి పూర్తిస్థాయి యాక్షన్ త్రిల్లర్ మూవీగా రూపొందించారు. ఆగస్టు ఒకటో తేదీ విడుదలకానున్న ఈ చిత్రంలో దర్శన్, పాటినీ కుమార్ హీరోహీరోయిన్లు. మన్సూర్ అలీఖాన్, లాల్, సుజిత్ శంకర్, మునీష్‌కాంత్ తదితరులు ఇతర పాత్రలు పోషించారు.

## చిత్రజ్యోతి



'అయ్య' ఫస్ట్‌లుక్ పోస్టర్ రిలీజ్

### 'అయ్య'గా డాక్టర్ రాందాస్ బయోగ్రఫీ

పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ జీవిత చరిత్ర ఆధారంగా 'అయ్య' మూవీ 'ది లయన్ ఆఫ్ తమిళనాడు' అనే ఉప శీర్షికతో తెరకెక్కనుంది. ప్రముఖ దర్శకుడు చేరన్ రూపొందించే ఈ చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను డాక్టర్ రాందాస్ శుక్రవారం విడుదల చేశారు. జూలై 25వ తేదీ రాందాస్ జన్మదినం సందర్భంగా చిత్ర నిర్మాణంపై అధికారిక ప్రకటన చేసి, ఆ మూవీ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో చిత్ర దర్శకుడు చేరన్‌తో పాటు లైకా ప్రొడక్షన్స్ హెడ్ జీకే తమిళ్ కుమరన్ పాల్గొన్నారు. ఇందులో డాక్టర్ రాందాస్ పాత్రను నటుడు ఆరి పోషిస్తున్నారు. రాందాస్ జీవితంలో చోటుచేసుకున్న అనేక ముఖ్య సంఘటనలను ప్రధానాంశాలుగా తీసుకుని రూపొందిస్తున్నారు. కాగా, ఈ చిత్రంలో నటించే ఇతర నటీనటులు వివరాలను త్వరలో వెల్లడించనున్నారు. తమిళ్ కుమరన్ ప్రొడక్షన్స్ పతాకంపై జీకేఎం తమిళ్ కుమరన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

## విజయ్ ఆంటోని 25వ చిత్రం

# 'శక్తి తిరుమగన్'

చిత్రపరిశ్రమలో బహుముఖ కళాకారుడిగా రాణిస్తున్న విజయ్ ఆంటోనీ నటించిన 25వ చిత్రం 'శక్తి మురుగన్'. రాజకీయ నేపథ్యంలో తెరకెక్కించగా, సెప్టెంబరు 5న విడుదల చేయనున్నారు. ఈ నేపథ్యంలో గురువారం విజయ్ ఆంటోనీ జన్మదిన వేడుకలను ఆయన సినిమా విలేకరుల సమక్షంలో జరుపుకున్నారు. ఇందులో బర్త్ డే కేక్ బదులుగా బిర్యానీ ప్యాకెట్‌తో ఈ వేడుకలను జరుపుకోవడం ప్రత్యేకత. విజయ్ ఆంటోనీ మీడియా మిత్రులకు ఒక్కో టీ స్పూన్ బిర్యానీ తినిపించి తన పుట్టిన రోజు వేడుకలను జరుపుకున్నారు. కాగా, మీరా విజయ్ ఆంటోనీ సమర్పణలో విజయ్ ఆంటోనీ ఫిల్మ్ కార్పొరేషన్ పతాకంపై నిర్మించిన ఈ చిత్రానికి అరుణ్ ప్రభు దర్శకుడు. విజయ్ ఆంటోనీ సంగీతం సమకూర్చిన ఈ చిత్రంలో తృప్తి రవీంద్ర హీరోయిన్‌గా, వాగై చంద్రశేఖర్, సునీల్ కృపాళిని, సెల్ మురుగన్, కిరణ్, రీని, రియా, మాస్టర్ కేశవ్ ఇతర పాత్రల్లో నటించారు. గురువారం ఈ చిత్రం నుంచి రెండు లిరికల్ పాటలను బర్త్‌డే వేడుకల్లో విడుదల చేశారు. ఈ సందర్భంగా విజయ్ ఆంటోనీ మాట్లాడుతూ, 'ఇది తన 25వ చిత్రం. మంచి సామాజిక సందేశంతో న్యూ పొలిటికల్ జానర్‌లో రూపొందించాం. నేటి సమాజంలో జరుగుతున్న రాజకీయ పరిస్థితులకు అద్దపట్టేలా స్క్రీన్‌ప్లే ముందుకుసాగుతుంది. ఇప్పటివరకు వచ్చిన రాజకీయ చిత్రాలకు భిన్నమైన సినిమాగా ఉంటుందన్నారు. దర్శకుడు అరుణ్ ప్రభు మాట్లాడుతూ, 'ప్రేక్షకులు ఆశించే అన్ని అంశాలు ఇందులో ఉంటాయి. ఆద్యంతం ఆసక్తిని కలిగించే మూవీగా ఉంటుంది' అని పేర్కొన్నారు.



మీడియా సమక్షంలో విజయ్ బర్త్‌డే వేడుకలు




# నేత్రపర్వంగా అంకాల పరమేశ్వరి ఊంజల్ సేవ

● మేల్‌మళయనూర్‌కు పోటెత్తిన భక్తులు

ప్యారీస్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): అమ్మవార్లకు ప్రీతికరమైన ఆడి మాసంలో మహిళలు ఉపవాసాలుండి భక్తిశ్రద్ధలతో పూజలు చేసి మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీ. ఆ రీతిలో ఆడి అమావాస్య, ఆడి శుక్రవార పర్వదినాలను పురస్కరించుకుని విల్లుపురం జిల్లాలోని మేల్‌మళయనూర్ అంకాల పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆడి అమావాస్య సందర్భంగా గురువారం తెల్లవారుజామున ప్రారంభించిన పూజలు అర్ధరాత్రి ఊంజల్ సేవతో ముగిశాయి. గర్భగుడిలో అమ్మవారికి, పరమేశ్వరుడికి విభూది, నారికేళ జలం, పంచామృతాలతో అభిషేకించారు. అమ్మవారు బంగారు కవచ అలంకారంతో భక్తులకు దర్శనం కల్పించారు. ఉత్సవమూర్తి అమ్మవారికి పూలతో అలంకరించి ప్రాకార మండపంలో కొలువుదీర్చారు. రాత్రి 11 గంటలకు అంకాల పరమేశ్వరి ఊంజల్ సేవ నేత్రపర్వంగా జరిగింది. శుక్రవారం ఉదయం అభిషేక పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మేల్‌మళయనూర్‌కు రాష్ట్రంలోని పలు జిల్లాలు, పుదుచ్చేరి, బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి ప్రభుత్వ రవాణా సంస్థలు ప్రత్యేక బస్సులు నడిపాయి.



ప్రాజెక్టును ప్రారంభిస్తున్న నిర్వాహకులు

## ఈసీఆర్‌లో రాజ్ పారిస్ 'బ్లూ జువెల్' ప్రారంభం

చెన్నై, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఈసీఆర్‌లో ఒకవైపు బంగాళాఖాతం, మరో వైపు బకింగ్‌హాం కాలువ, ఇంకోవైపు ముత్తుకాడు సరస్సు కనిపించేలా 55 అతి విశాలమైన 3బీహెచ్‌కే నివాసాలతో రూపొందిన రాజ్ పారిస్ బ్లూ జువెల్ ప్రాజెక్టు ప్రారంభమైంది. 14అంతస్తుల్లో నిర్మించే ఈ ప్రాజెక్టులో ప్రతి అంతస్తులో కేవలం రెండు నివాసాలు మాత్రమే వుంటాయని రాజ్‌పారిస్ డైరెక్టర్ రాజ్‌కుమార్ సచ్చిదానందం తెలిపారు. శుక్రవారం ఈ ప్రాజెక్టు ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక్కో ఫ్లాట్ 2221-2984 చ.అడుగుల విస్తీర్ణంతో వుండగా, ప్రతి నివాసం బంగాళాఖాతం, ముత్తుకాడు సరస్సు, బకింగ్‌హాం కాలువ కనిపించేలా రపొందించామన్నారు. బ్లూ జువెల్ ఈసీఆర్‌లో బొటిక్ లగ్జరీ ల్యాండ్ మార్క్‌గా ఉద్భవిస్తుందని వివరించారు.

## నేత్రవైద్యంలో సరికొత్త ప్రక్రియ

● డాక్టర్ అమర్ అగర్వాల్ ఆవిష్కరణ



చెన్నై, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాత నేత్రవైద్యుడు, స్థానిక డాక్టర్ అగర్వాల్స్ ఐ హాస్పిటల్స్ గ్రూప్ ఛైర్మన్ డాక్టర్ అమర్ అగర్వాల్ పిన్‌హోల్ పపిల్లో ప్లాస్టీ (పీపీపీ) అనే కొత్త చికిత్సా విధానాన్ని ఆవిష్కరించారు. ఈ చికిత్స కంటిలోని కార్నియా మార్పిడికి సరళమైన, అత్యంత ప్రభావవంతమైన ప్రత్యామ్నాయ చికిత్స అని వైద్యనిపుణులు చెబుతున్నారు. దాతల నుండి నేత్రదానం ద్వారా కార్నియాల కోసం యేళ్ల తరబడి ఎదురుచూస్తున్న వారికి ఈ కొత్త చికిత్సా విధానం వరంలాంటిదని నేతల వైద్యనిపుణులు తెలిపారు. కార్నియా అసమానతలు ఉన్న రోగుల్లో ఈ ప్రక్రియ ద్వారా దృష్టిని గణనీయంగా మెరుగుపడుతుంది. తరచుగా కంటి అద్దాలు లేదా కాంటాక్ట్ లెన్స్ అవసరాన్ని కూడా తొలగిస్తుంది. ఈ కొత్త ప్రక్రియ గురించి డాక్టర్ అమర్ అగర్వాల్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా 2 కోట్లకు పైగా ప్రజలు దృష్టిలోపం లేదా అంధత్వంతో జీవిస్తున్నారని, వారి సంఖ్యకు తగ్గట్లు దాతల నుండి కార్నియాలు దానంగా లభించడం కష్టసాధ్యమన్నారు. ఈ నేపథ్యంలో కార్నియా సంబంధిత అంధత్వ నివారణకు పిన్‌హోల్ పపిల్లోప్లాస్టీ (పీపీపీ) దోహదపడుతుందని తెలిపారు. దేశ విదేశాలలోని 250కి పైగా ఉన్న అగర్వాల్ ఆస్పత్రుల్లో ఈ నూతన చికిత్సా విధానం అందుబాటులో ఉందని ఆయన వివరించారు.



చెన్నై తిరువిక నగర్ జంబులింగం మెయిన్ రోడ్డులోని కల్యాణ మండపం ఏర్పాటైన 'ఉంగలుడన్ స్టాలిన్' విజ్ఞప్తుల స్వీకరణ శిబిరాన్ని పరిశీలిస్తున్న మంత్రి పీకే శేఖర్‌బాబు, మేయర్ ఆర్.ప్రియ తదితరులు

## డెర్బీ బ్రాండ్ అంబాసిడర్‌గా గౌతమ్‌రామ్ కార్తిక్




నటుడు గౌతమ్‌రామ్ కార్తిక్‌తో డెర్బీ సంస్థ నిర్వాహకులు

ప్యారీస్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పురుషుల రెడీమేడ్ వస్త్రాల ఉత్పత్తిలో పేరొందిన డెర్బీ సంస్థ కొత్త బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రముఖ సినీనటుడు గౌతమ్ రామ్ కార్తిక్ ఎంపికైనట్లు ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ విజయ్ కపూర్ శుక్రవారం ప్రకటించారు. దేశవ్యాప్తంగా దాదాపు 50 అవుట్‌లెట్లు కలిగిన ఈ సంస్థ తమ ఉత్పత్తుల నాణ్యత, మన్నికతో వినియోగదారులను ఆకట్టుకునేలా గౌతమ్‌రామ్ కార్తిక్‌ను బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించినట్లు ప్రకటించింది.

## తరుణి

విద్య వినయమొసంగి, వివేకాన్నిస్తుందని, విచక్షణా జ్ఞానాన్ని పెంపొందిస్తుందని, అందుకే "చదువుకోనాయన్న చదువుకో తండ్రీ, చదువుకొంటే నీకు సౌఖ్యమబ్బేను" అని పెద్దలు చెప్పేవారు. కాని యీనాటి విద్యా లక్ష్యం ఉద్యోగప్రాప్తి, ఉపాధి లబ్ధి. ఉద్యోగార్జన కోసం చదివిన చదువులు సంతృప్తినివ్వక తమ అభిరుచి మేరకు తమ విద్యార్హతలు పెంచుకునే సరస్వతీ పుత్రులు అక్కడక్కడ దర్శనమిస్తుంటారు. ఉద్యోగాపేక్ష లేకుండా చదువుతూనే, చదువులోనే సంతృప్తిపొందే వారు కూడ సమాజంలో అప్పుడప్పుడు కనిపిస్తుంటారు. వయసు పైబడినా, చదువు మీది ఆస సడలక, ఆత్మానందాన్ని అనుభవిస్తూ, అనేక డిగ్రీలు సాధిస్తున్న మహిళామణులు అరుదుగా ఉంటారు. అటువంటి వారిలో డాక్టర్ ప్రభల జానకి ఒకరు. ఆమె విద్యా ప్రస్థానం నేటి 'తరుణి'లో.....

\- వేళచ్చేరి, ఆంధ్రజ్యోతి





ఆకాశవాణి విశాఖపట్నం కేంద్రంలో బి.హైగ్రేడ్ కళాకారిణిగా రాణించారు. పలు అంశాలపై ప్రసంగాలు చేశారు. ఢిల్లీ ఆకాశవాణి కేంద్రంలో క్యాజువల్ న్యూస్ రీడర్‌గా కూడా కొంతకాలం పనిచేశారు. జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో ఎన్నో పత్ర సమర్పణలు చేశారు, చేస్తున్నారు.

### విద్యారంగంలో విశేష ప్రతిభ

# 'వికాస శిరోమణి' అవార్డు గ్రహీత

● విభిన్న రంగాల్లో రాణిస్తున్న డాక్టర్ ప్రభల జానకి




డా.ప్రభల జానకి పుట్టింది హైదరాబాద్‌లో. తండ్రి నముదూరి సూర్యనారాయణ ఇన్‌కం టాక్స్ కమిషనర్‌గా పనిచేశారు. తల్లి కామేశ్వరి గృహిణి., వనపర్తి ఆస్థాన విద్వాంసులు కీ.శే.నెమలూరి వేంకటశాస్త్రి మునిమనవరాలు జానకి. తండ్రి ఉద్యోగరీత్యా వివిధ ప్రదేశాల్లో పనిచేయడంతో ఆమె పాఠశాల విద్యాభ్యాసం ఏలూరు, కాకినాడలో జరిగింది. దూరవిద్య ద్వారా బి.ఏ డిగ్రీ పొందారు. అన్నామలై యూనివర్శిటీ నుండి దూరవిద్య ద్వారా బీ.ఇడి., డిగ్రీ తీసుకున్నారు. వివాహానంతరం ఢిల్లీలో స్థిరపడి, అక్కడ ఆంధ్రా ఎడ్యుకేషనల్ సొసైటీలో, జనక్‌పురి బ్రాంచ్ స్కూల్లో కొన్నేళ్లు, డీఏవీ స్కూల్లో కొన్నేళ్లు ఉపాధ్యాయురాలిగా సేవలందించారు.




ఆ తరువాత ఉద్యోగాలకు స్వస్తి పలికి భర్తతో పాటు వైజాగ్, కటక్‌లో కొన్నేళ్లు గడిపారు.

### విద్యపై ఆసక్తి... చదువులోనే సంతృప్తి...

జ్ఞాన సముపార్జన ధ్యేయంగా ఆంధ్రా యూనివర్శిటీ నుంచి జానకి తెలుగు ఎమ్.ఏ చేశారు. వేదిక్ ఆస్ట్రాలజీలో కూడా ఎమ్.ఏ పట్టా తీసుకున్నారు. ఎం.ఫిల్ గోల్డ్ మెడల్ సాధించారు. అంతేకాదు ఢిల్లీ యూనివర్సిటీలో తెలుగులో పరిశోధన చేసి పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. అంతటితో ఆమె విద్యాతృష్ణ తీరలేదు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి నటన, దర్శకత్వంలో డిప్లొమా చేశారు. జర్నలిజంలో కూడా డిప్లొమా, కర్ణాటక సంగీతంలో 'సంగీత శిరోమణి' వంటివి సాధించారు. బరంపురం విశ్వవిద్యాలయలో డి.లిట్ చేశారు. మద్రాసు విశ్వవిద్యాలయంలో రెండో డి.లిట్ చేశారు. సంప్రదాయ, జానపద, ప్రదర్శన కళలపై 'ఆంధ్ర మహాభాగవత ప్రభావం' అనే అంశంపై భారత ప్రభుత్వ, సంస్కృతీ విభాగంలో పరిశోధన చేశారు. 18,19 శతాబ్దాల్లో వెల్లివిరిసిన హరికథా సాహిత్యంపై కూడా ఆమె పరిశోధన చేశారు.

చదువులో డిగ్రీలు సాధించడమేకాక, రచనలు చేయడంలోనూ ఆమె నేర్పరి. ఆమె రచించిన గ్రంథాలు ఆమె ప్రతిభకు పట్టం కడతాయి. 'భక్తి పథంలో ప్రస్థానత్రయం' అనే గ్రంథంలో పోతన, రామదాసు, త్యాగరాజుల గురించి వివరించారు. 'సరస్వతీ నమస్తుభ్యం' పేరుతో విశ్లేషణాత్మక వ్యాస సంపుటిని వేయించారు. 'విశ్వనాధ విషాదాంత నాటకాలు', 'మహాభారత ప్రమదావలోకనం', 'కళలకాణాచి-ఆంధ్ర మహాభాగవతం', 'తెలుగు వాగ్గేయకారుల సాహితీ వైభవం', 'శ్రీనాధుడి సాహితీ ప్రస్థానం', 'హరికథా సాహిత్య సింధువు' వంటి ఎన్నో గ్రంథాలను రచించి జానకి వ్యాసాలు ఎన్నో పత్రికల్లో ప్రచురింపబడ్డాయి. దేశంలోని వివిధ ప్రాంతాలలో జరిగే సాంస్కృతిక ఉత్సవాలను పరిశీలించి పత్రికలలో సమీక్షించటం ఈమె ప్రత్యేకాభిరుచి.

### పురస్కారాలు...

డాక్టర్ జానకి ఎన్నో పురస్కారాలు, సన్మానాలు అందుకున్నారు. ఢిల్లీలోని తెలుగు అకాడమీ వారు 2013లో 'రాష్ట్రీయ వికాస శిరోమణి' అవార్డు బహూకరించారు. ఢిల్లీలోని ఆంధ్ర వనిత మండలి రెండుసార్లు ఆమెను సన్మానించింది.. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, అక్షరయాన్ సంస్థ వారు 'మాతృ వందనం' పురస్కారంతో సత్కరించాయి. హైదరాబాద్ తెలుగు విశ్వవిద్యాలయం వారు డా.జానకిని 'ప్రతిభా పురస్కారం'తో సన్మానించారు.



**కుటుంబం:**

జానకి భర్త పీవీకే సుబ్బారావు. ఎంఎంటీసీలో జనరల్ మేనేజర్‌గా పనిచేశారు. ఈ దంపతులకు ముగ్గురు కుమారులు.

**వ్యక్తిత్వం:** ఏడు పదులు దాటినా ఆమెలో ఇంకా ఉత్సాహం ఉరకలెత్తుతుంది.తనను తానే ప్రోత్సహించుకుంటూ ఇంకా రచనలు చేస్తున్నారు. ఢిల్లీలో ఎన్నో తెలుగు సంస్థల్లో సభ్యురాలిగా క్రియాశీలక పాత్ర పోషించారు. చెన్నైలో స్థిరపడిన ఆమె చెన్నైలో ఎన్నో తెలుగు సంస్థల్లో ఉపన్యాసకురాలిగా శ్రోతల ప్రశంసలనందుకున్నారు.చెన్నై ఆకాశవాణిలో కొన్ని ప్రసంగాలు చేశారు.సంగీత, సాహిత్యాభిమానిగా ఆయా కార్యక్రమాలకు హాజరవడం ఆమె అభిరుచి. కర్ణాటక సంగీత కళాకారిణిగా ఆమె దానికి సంబంధించిన అంశాలను వివరిస్తుంటారు.ఆసక్తి ఉండాలి కానీ వయసు చదువుకు, గ్రంథ రచనకు ఆటంకం కాదన్నదానికి ఆమె నిలువెత్తు నిదర్శనం. దేవాలయాల సందర్శన, సంగీత కచేరీలు ఆనందించడం ఆమె ఇతర అభిరుచులు.




"ఏ పని చేసినా అంకితభావంతో చేయాలి. సంకల్పం బలంగా ఉంటే నిరాశా నిస్పృహలు దరిచేరవు. ఉత్సాహం అణగారకుండా ఉంటే ఉన్నత శిఖరాలు అధిరోహించగలుగుతాము". అంటూ జానకి తన మనోభావాలు తరుణితో పంచుకున్నారు..

## శ్రీవిల్లిపుత్తూరులో వైభవంగా గరుడ సేవ



ఐదు గరుడ వాహనాలపై విహరిస్తున్న శ్రీనివాసపెరుమాళ్

ప్యారీస్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్ జిల్లా శ్రీవిల్లిపుత్తూరు ఆండాళ్ ఆలయంలో కోలాహలంగా జరుగుతున్న ఆడిపూర ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన ఐదు గరుడవాహన సేవలు గురువారం రాత్రి మొదలై శుక్రవారం తెల్లవారుజాము వరకు నేత్రపర్వంగా నిర్వహించారు. ఈ ఆలయంలో ఈ నెల 20వ తేదీ పతాకావిష్కరణతో ఆడిపూర ఉత్సవాలను ప్రారంభించారు. ఐదో రోజున ఐదు గరుడ వాహనాలపై శ్రీనివాసపెరుమాళ్, రంగమన్నార్, కట్టలగర్, సుందర రాజ పెరుమాళ్, తిరుత్తంగ రాజ పెరుమాళ్ ఉత్సవ మూర్తులను ఉంచి, హారతులిచ్చారు. రాత్రి 10.30 గంటలకు ప్రారంభమైన గరుడ వాహనాల ఊరేగింపు శుక్రవారం తెల్లవారుజామున 5 గంటలకు ముగిసింది. భజన బృందాలు, కళాకారులు, నృత్యాలు, కీర్తనలతో ఊరేగింపులో పాల్గొన్నారు.

## అమ్మవారికి కరెన్సీనోట్ల అలంకారం

చెన్నై, జూలై 25 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి వరగనేరి నిత్యానంద పురంలోని ముత్తుకణ్ మారియమ్మన్ ఆలయంలో తమిళ ఆషాడ మాసం రెండో శుక్రవారం సందర్భంగా అమ్మవారు ధనలక్ష్మి అలంకారంలో భక్తులను అనుగ్రహించారు. అమ్మవారికి రూ.500లు, రూ.200లు, రూ.50లు, రూ.20, రూ.10ల కరెన్సీనోట్లతో అలంకరించారు. అలంకరణకు రూ.5లక్షల విలువైన కరెన్సీనోట్లను ఉపయోగించారు. ధనలక్ష్మి అలంకారంలో అమ్మవారిని దర్శించుకునేందుకు ఆలయం వద్ద బారులు తీరారు.



ధనలక్ష్మి అలంకారంలో ముత్తుకణ్ మారియమ్మన్

# రిటైర్డ్ ఐపీఎస్ అధికారి అరుదైన రికార్డు

● 159 మారథాన్లలో పాల్గొన్న వైనం

చెన్నై, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఆయనో రిటైర్డ్ ఐపీఎస్ అధికారి.. ఆరు పదుల వయసు దాటినా ఉరకలెత్తే ఉత్సాహంతో ఏకంగా 159 మారథాన్లలో పాల్గొని 'ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్'లో చోటు సంపాదించారు. రిటైర్డ్ డీజీపీ డాక్టర్ కె.జయంత్ మురళి 2022 జనవరి నుంచి ఈ ఏడాది మార్చి వరకు 159 మారథాన్లలో పాల్గొని ఎంతోమందికి మార్గదర్శకంగా నిలిచారు. ఇప్పటి వరకూ ఆయన 138 హాఫ్ మారథాన్లు, 21 ఫుల్ మారథాన్లలో పాల్గొన్నారు. 1991-2022 నడుమ మూడు దశాబ్దాల పాటు రాష్ట్ర పోలీస్‌శాఖకు జయంత్ మురళి సేవలందించారు. రిటైరైన తరువాత ఆయన తన యూనిఫాంను పరుగు పందెం కోసం మార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి మారథాన్ ముగింపు తనకు ప్రారంభం మాత్రమేనన్నారు. డాక్టర్ మురళి తమిళం, ఆంగ్ల భాషల్లో రచించిన 8 గ్రంథాలు అన్నివర్గాల వారికి కరదీపికలుగా దోహదపడుతున్నాయి.



'ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్'తో డాక్టర్ మురళి

## శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. డీఆర్‌డీవో మాజీ చైర్మన్ సతీష్‌రెడ్డి, మహారాష్ట్ర మంత్రి పంకజ గోపీనాథ్ ముండే, ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్ రెడ్డి ఉన్నారు.



సతీష్‌రెడ్డి

- తిరుమల, ఆంధ్రజ్యోతి


## సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 24 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

**బుధవారం హుండీ ఆదాయం: రూ.4.49 కోట్లు**

**గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 68,838**

**తలనీలాలు సమర్పించినవారు: 22,212**







అందమైన అవ్వాచారికోన లోయ

# అవ్వాచారి కోన

● ఆత్మహత్యాయత్నాలకు మళ్లీ నిలయం

తిరుమల, జూలై25(ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటిఘాట్‌రోడ్డులోని అవ్వాచారికోన లోయ మళ్లీ ఆత్మహత్యాయత్నాలకు నిలయంగా మారుతోంది. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతో కొంతమంది, స్వామి సన్నిధిలో ఆత్మహత్య చేసుకుంటే వైకుంఠప్రాప్తి లభిస్తుందని మరికొంత మంది ఇలా అనేక మంది ఆత్మహత్యలు చేసుకునేందుకు ఘాట్‌రోడ్డులోని అవ్వాచారి కోనలోయలో దూకిన సందర్భాలు చాలానే ఉన్నాయి. ఇటీవల కాస్త తగ్గినట్టే అనిపించినా తాజా ఘటనలతో మళ్లీ తిరిగి పెరుగుతున్నాయనిపిస్తోంది. తిరుమల నుంచి తిరుపతికి చేరుకునే మొదటి ఘాట్‌రోడ్డులోని మోకాళ్లమెట్లు ప్రాంతం నుంచి లక్ష్మీనరసింహస్వామి ఆలయం వరకున్న రోడ్డుకు ఎడమవైపు అతిభారీ లోయ ఉంది. ఇదే మార్గంలో అలిపిరి కాలినడకభక్తుల మార్గం కూడా కలుస్తుంది. ఈలోయ కొందరికి ప్రకృతి అందాలను పంచే ప్రాంతంగా ఉంటే మరి కొందరికి ఆత్మహత్యలు చేసుకునేందుకు అనువుగా మారింది. ఐదేళ్ల క్రితం వరకు అవ్వాచారికోన లోయలో ఆత్మహత్యాయత్నాలకు పాల్పడే వారి సంఖ్య అధికంగా ఉండేది. 2010 సెప్టెంబరులో ఈలోయలోకి దూకిన యువతిని మూడురోజుల పాటు గాలించి ప్రాణాలతో కాపాడారు. 2012లోనూ రంగస్వామి అనే యువకుడు కూడా ఇలానే లోయలో పడిపోయాడు. తాను చనిపోయేలా ఉన్నానని, కాపాడాలంటూ అతనే ఫోన్ చేసి పోలీసుల సహాయం కోరాడు. భద్రతా సిబ్బంది అతడ్ని గుర్తించి లోయనుంచి పైకి తీసుకువచ్చేలోపు మృతి చెందాడు. 2018లో కూడా నీరజ అనే యువతి ఆత్యహత్యకు యత్నించింది. వీడియో కాల్ ద్వారా ఆమె ప్రమాదంలో ఉందని గుర్తించి తిరుమల పోలీసులు లోయలోకి దిగి రక్షించారు. 2009 నుంచి 2012 మధ్యలో దాదాపు ఎనిమిది మంది అవ్వాచారి కోనలోయలో మృతి చెందారు. 2018 తర్వాత నిరంతరాయంగా భద్రతాసిబ్బంది నిఘా, భక్తుల రాకపోకలు అధికంగా ఉండటం, తిరుమలలో ఆత్మహత్యలకు పాల్పడితే పాపం అంటూ అర్చకుల నుంచి ప్రకటనలు రావడంతో చాలా వరకు ఆత్మహత్యలకు పాల్పడేవారి సంఖ్య తగ్గింది.

లోయ వద్ద ప్రమాదకరంగా ఫొటో షూట్‌లు



### తాజాగా మరో రెండు ఘటనలు

● గతనెల మార్చి నెలలో సిద్దారెడ్డి అనే వ్యక్తి అక్కగార్ల ఆలయానికి సమీపంలోని లోయలోకి దూకి ఆత్మహత్యకు యత్నించాడు. ఆ సమయంలో హరిబాబు అనే భక్తుడు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు దాదాపు మూడురోజుల పాటు గాలించినా ఆ భక్తుడి ఆచూకీ లభించలేదు. కొద్దినెలల తర్వాత ఆ వ్యక్తి హైదరాబాద్‌లో ఉన్నట్టు పోలీసులకు సమాచారం అందడంతో ఊపిరి పీల్చుకున్నారు.

● వారం కిందట (బుధవారం) ఆళ్లగడ్డ వాసి మాధవరాయుడు అనే మరో డ్రైవర్ కూడా ఆత్మహత్య చేసుకునేందుకు లోయలోకి దూకేశాడు. అదృష్టవశాత్తు భక్తులు ఇచ్చిన సమాచారంతో గంటల వ్యవధిలోనే భక్తుడిని భద్రతా సిబ్బంది కాపాడారు.

### ఏవీ జాగ్రత్తలు?

కాలినడకన అలిపిరిలో బయలుదేరిన భక్తులందరూ తిరుమలకు చేరుకుంటున్నారా అనే రికార్డులేవీ భద్రతాసిబ్బంది వద్ద ఉండవు. మార్గం మధ్యంలో ఏం జరిగిన తెలుసుకునే పరిస్థితీ లేదు. అలిపిరి నుంచి తిరుమలకు వరకు సీసీ కెమరాల నిఘా కూడా తక్కువే. ఇప్పటివరకు ఆత్మహత్య చేసుకునేందుకు ఎవరో దూకారంటూ భక్తులు సమాచారమిస్తే తెలిసవే తప్పా నిఘాతో గుర్తించినవి లేవీ లేవు. ఇతర భక్తులు చూడకుండా లోయలో దూకితే గుర్తించే అవకాశమే లేదు. నడకమార్గానికి పక్కనే లోయ ఉన్న క్రమంలో ఆత్మహత్యలకు అనువుగా మారుతోంది. మరోవైపు లోయ ప్రాంతానికి సంబంధం లేకుండా కూడా కాలినడకమార్గంలోనూ అనేక ఆత్మహత్యలు జరిగాయి. ఇందులో ప్రధానంగా 2022 ఆగస్టులో తమిళనాడుకు చెందిన ఓ భక్తుడు ఏడో మైలు వద్ద బ్లేడ్‌తో గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అదే ఏడాది అక్టోబరు నెలలో ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందిన నాగేశ్వర్‌రెడ్డి అ న యువకుడు గాలిగోపురం వద్ద చెట్టుకు ఉరివేసుకుని మృతి చెందాడు. ఈక్రమంలో ఇప్పటికైనా టీటీడీ భద్రతా విభాగం ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సి ఉంది. లోయకు, కాలినకడమార్గానికి మధ్య ప్రస్తుతం కొంతమేరకే ఇనుపకంచె ఉంది. భక్తులెవ్వరు లోయలోకి దూకకుండా, లేదా సెల్ఫీల ప్రయత్నంలో ప్రమాదవశాత్తు పడిపోకుండా మిగిలిన ప్రాంతంలోనూ కంచెను ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరముంది. అలాగే నడకమార్గం మొత్తం సీసీ కెమెరాల నిఘా అవసరం. వీటితో పాటు భద్రతా సిబ్బందితో నిరంతరాయంగా పెట్రోలింగ్ నిర్వహిస్తూ నిఘా పెంచాలి. అలిపిరిలో మొదలైన భక్తులు తిరుమలకు చేరుతున్నారా లేదా అని తెలుసుకునే వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలి. ఇవన్నీ చేస్తే తప్పా ఆత్మహత్యయత్నాలు తగ్గవనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## ఎర్రచందనం స్మగ్మర్లకు ఐదేళ్ల జైలు

● రూ.3 లక్షల జరిమానా



నిందితులతో పోలీసులు

పిచ్చాటూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): తమిళనాడుకు చెందిన నలుగురు ఎర్రచందనం స్మగ్లర్లకు శుక్రవారం తిరుపతి రెడ్ శాండిల్ స్పెషల్ కోర్టు జడ్జి నరసింహమూర్తి ఐదు సంవత్సరాల జైలు శిక్ష, రూ.3 లక్షల జరిమానా విధించారు. పిచ్చాటూరు ఎస్‌ఐ వెంకటేశ్వరులు తెలిపిన వివరాలు... 2018 డిసెంబరు 25న అప్పటి ఎస్‌ఐ రామాంజనేయులు సిబ్బందితో మండలంలోని రెప్పాలపట్టు వద్ద తనిఖీలు నిర్వహించారు. శ్రీకాళహస్తి నుంచి రెండు కార్లు చెన్నై వైపు వెళ్తుండగా నిలిపి తనిఖీ చేశారు. రెండు వాహనాల్లో 44 ఎర్రచందనం దుంగలున్నట్టు గుర్తించారు. వాహనాలు సహా ఎర్రచందనం దుంగలను స్టేషన్‌కు తరలించారు. తమిళనాడు రాష్ట్రం కాంచీపురం జిల్లా శంకరాపురానికి చెందిన ఎం.భాస్కర్, చెంబరంబాక్కానికి చెందిన పుగ ఎంతి, మేట్ స్ట్రీట్‌కు చెందిన ప్రభు, కొన్నికుప్పానికి చెందిన హుస్సేన్‌ను అరెస్టు చేశారు. ఈ క్రమంలో సత్యవేడు మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. అప్పటి నుంచి రెడ్ శాండిల్ స్పెషల్ కోర్టులో ట్రయల్ జరుగుతోంది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలకృష్ణ నాయుడు వాదనల మేరకు నిందితులకు శిక్ష ఖరారైంది. కాగా స్మగ్లర్లను నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు. ఎస్‌ఐ వెంకటేష్, ఏఎస్‌ఐ వెంకటరాజు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

## ఆటోను ఢీకొట్టిన టిప్పర్

● మహిళ మృతి ● ముగ్గురికి తీవ్ర గాయాలు

● ఆటో డ్రైవర్ పరిస్థితి విషమం

కోట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కోట మండలం చిట్టేడు వద్ద శుక్రవారం ఆటోను టిప్పర్ ఢీకొట్టిన ఘటనలో ఒక మహిళ మృతి చెందగా, ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఆటో డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉంది. స్థానికుల కథనం మేరకు వివరాలు... మండల పరిధిలోని చిట్టేడు బీసీ కాలనీకి చెందిన పలువురు మహిళలు ఉపాధి పనులకు వెళ్లేందుకు సమీపంలో ఉన్న కోట - గూడూరు రోడ్డు వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి ఆటోలో గ్రామ పొలిమేరల్లో ఉన్న గుంటల్లో పనులకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. రోడ్డు పక్కన ఆగిన ఉన్న ఆటో ఎక్కుతుండగా గూడూరు కంకర్ లోడ్‌తో వేగంగా వచ్చిన టిప్పర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో బత్తల పోలమ్మ(65) అక్కడికక్కడే మృతి చెందగా, ఆటోలో ఉన్న తలారి గంగమ్మ, నందిమాల నిర్మలమ్మ, ఉత్తమనాడు బాలమ్మతో డ్రైవర్ పోలూరు కృష్ణ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం గూడూరు, నెల్లూరు ఆస్పత్రులకు తరలించారు. ఆటో డ్రైవర్ కృష్ణ తలకు బలమైన గాయం తగలడంతో ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ప్రమాదానికి కారణమైన టిప్పర్ డ్రైవర్ పోలీసు స్టేషన్‌లో లొంగిపోయినట్లు తెలిసింది. ఎస్‌ఐ పవన్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## హెడ్‌మాస్టర్ మందలించారని..

తిరుమల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): హెడ్‌మాస్టర్ మందలించారని పారిపోయి తిరుమల చేరుకున్న నలుగురు అనంతపురం విద్యార్థులను తిరుమల పోలీసులు తిరిగి వారి కుటుంబాలకు అప్పగించారు. అనంతపురంలోని బీసీ బాలుర వసతి గృహంలో ఉంటూ పొట్టి శ్రీరాములు నేతాజీ స్కూల్‌లో చదువుకుంటున్న నలుగురు విద్యార్థులను సరిగా చదవడంలేదని హెడ్‌మాస్టర్ మందలించారు. గురువారం స్కూల్ నుంచి వీరు తిరిగి రాకపోవడంతో హాస్టల్ వార్డన్ అనంతపురం 3వ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తులో భాగంగా వీరు తిరుమలలో ఉన్నట్టు గుర్తించారు. శుక్రవారం ఉదయం తిరుమల పోలీసులకు బాలుర ఫొటోలు పంపారు. వెంటనే అప్రమత్తమైన కమాండ్ కంట్రోల్, విజిలెన్స్, ట్రాఫిక్, బీట్ సిబ్బంది సీసీ ఫుటేజీ పరిశీలించారు. బాలురు అలిపిరి మెట్ల మార్గంలో తిరుమల నుంచి తిరుపతికి వెళుతున్నట్టు గుర్తించి వారిని అదుపులోకి తీసుకుని అనంతపురం పోలీసులకు అప్పగించారు. సకాలంలో స్పందించి పిల్లలను గుర్తించిన తిరుమల పోలీసులను జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అభినందించారు.



పల్లకిలో స్వామికి హారతులు

## కుమారస్వామికి పల్లకీసేవ





శ్రీవల్లీ, దేవసేన

శ్రీకాళహస్తి, జూలై 25(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా పట్టణంలోని విజ్ఞానగిరిపై కొలువైన కుమారస్వామి ఆడికృత్తిక వార్షికోత్సవాల్లో భాగంగా చివరిరోజైన శుక్రవారం ముక్కంటి ఆలయంలో పల్లకీసేవ కనుల పండువగా సాగింది. వళ్లీ, దేవసేన సమేత కుమారస్వామి పల్లకీలో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు.

శ్రీసిటీని సందర్శించిన

## ఆస్ట్రేలియా కాన్సుల్ జనరల్

● ఆక్స్ ఎయిర్ పరిశ్రమతో ఎంఓయూ



ఎంవోయూ మార్చుకుంటున్న కాన్సుల్ జనరల్, శ్రీసిటీ ఎండీ

సత్యవేడు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఆస్ట్రేలియా కాన్సుల్ జనరల్ సిలైజాకీ అధికారుల బృందంతో శుక్రవారం శ్రీసిటీలో పర్యటించారు. శ్రీసిటీ సీనియర్ వైస్ చైర్మన్ ఆర్.శివశంకర్ వారికి సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రగతి ప్రత్యేకతలను వివరించారు. కాన్సుల్ జనరల్‌తో చర్చల సందర్భంగా పారిశ్రామిక అభివృద్ధిని వివరించిన శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి 31 దేశాలకు చెందిన 240కి పైగా పరిశ్రమలు శ్రీసిటీలో స్థాపించాయని తెలిపారు. విభిన్న రంగాల్లో పెట్టుబడి అవకాశాల కోసం అన్వేషిస్తున్న కంపెనీలకు శ్రీసిటీ గమ్యస్థానం అన్నారు. శ్రీసిటీలోని వెంచర్ ఆటోమోటివ్ ఇండియా పరిశ్రమ (ఆస్ట్రేలియా ఉమ్మడి భాగస్వామ్య కంపెనీ) దీనికి ఉదాహరణగా పేర్కొన్నారు. ప్రపంచ శ్రేణి మెట్రో రైళ్లను తయారు చేసే ఆల్‌స్టామ్ కంపెనీ మొట్టమొదటి పూర్తిస్థాయి ఆటోమోటెడ్ మెట్రో రైళ్లను సిడ్నీ మెట్రోకు సరఫరా చేయడం ఇండియా - ఆస్ట్రేలియా పారిశ్రామిక సహకారంలో మైలురాయిగా సన్నారెడ్డి అభివర్ణించారు. శ్రీసిటీ వ్యాపారానుకూలత పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన ఆస్ట్రేలియా కాన్సుల్ జనరల్ భారత్‌లో అత్యుత్తమ వ్యాపార కేంద్రాల్లో శ్రీసిటీ ఒకటని అభిప్రాయం వ్యక్తం చేశారు.

### ఆక్స్ ఎయిర్ పరిశ్రమతో ఎంఓయూ

ఈ పర్యటనలో కీలకాంశంగా కాన్సుల్ జనరల్ సిలైజాకీ సమక్షంలో శ్రీసిటీలో పరిశ్రమ ఏర్పాటుకు ఆస్ట్రేలియాకు చెందిన ఇంజనీరింగ్ సంస్థ ఆక్స్ ఎయిర్ ప్రెజర్ వెసెల్స్ మానుఫ్యాక్చరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ఏర్పాటుకు శ్రీసిటీతో ఒప్పందం కుదుర్చుకుంది. పారిశ్రామిక అవసరాలకు ఉపయోగపడే వివిధ గ్యాస్‌లను నిల్వచేసే అధిక పీడన ట్యాంకులను ఈ కంపెనీ తయారు చేస్తుంది.

## అన్బుమణి పాదయాత్ర ప్రారంభం

● తిరుప్పోరూర్ మురుగన్ ఆలయంలో పూజలు

ప్యారీస్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం కల్పించిన 10 ప్రధానమైన హక్కులను రాష్ట్ర ప్రజలకు వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ పీఎంకే నేత డాక్టర్ అన్బుమణి శుక్రవారం సాయంత్రం చెంగల్పట్టు జిల్లా తిరుప్పోరూర్ నుంచి పాదయాత్ర ప్రారంభించారు. ఆయన నవంబర్ 1వ తేదీ వరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటించనున్నారు. పాదయాత్రకు ముందు తిరుప్పోరూర్‌లోని మురుగన్ ఆలయంలో పూజలు నిర్వహించి స్వామి వారి దర్శనం చేసుకున్నారు. అనంతరం తమ మద్దతుదారులతో కలిసి పాదయాత్రను ప్రారంభించిన సందర్భంగా మీడియాతో మాట్లాడారు. డీఎంకే ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించి వారి హక్కులను కాలరాసిందని ఆరోపించారు. రాష్ట్రప్రభుత్వ వైఖరి, ప్రజల పట్ల నిర్లక్ష్యం తదితర అంశాల గురించి ప్రజలకు తెలియజేయాలన్న ఉద్దేశంతో తాను నాలుగు నెలల పాదయాత్రలో పాల్గొంటున్నట్లు ఆయన తెలిపారు. ముందుగా తన ప్రచార యాత్రకు సంబంధించి రూపొందించిన పాటల సీడీని అన్బుమణి ఆవిష్కరించారు.



## కనుమరుగవుతున్న కాకులు!

● పిండాలు తినేందుకూ కరువైన వాయసాలు



చెన్నై, జూలై 25 (ఆంధ్రజ్యోతి): 'ఇంటి చూరుపైనో.. ఇంటెదుటి చెట్టుపైనో.. ప్రహరీ గోడపైనో కూర్చుని 'కావ్.. కావ్..' అంటూ కాకి అరుస్తుంటే ఆ 'అనుభూతే' వేరు.. ఆ కేకలు విని 'ఇదేంటి కాకి గోల?' అని బయటకు అనుకుంటాం గానీ.. ఆ శబ్దం వింటుంటే మనల్ని మనం గుర్తు చేసుకున్నట్లు ఉంటుంది కదూ!..

కాకి అరుపు కొంతమందికైతే దివంగతులైన తమ పెద్దలే స్వయంగా వచ్చి పిలుస్తున్నట్లు.. తమ బంధువుల రాకను ముందుగానే సందేశం అందిస్తున్నట్లు అనిపించకమానదు. తద్దినం రోజు పెట్టే పిండాన్ని కాకి వచ్చి తింటే పెద్దలే స్వయంగా వచ్చి తిన్నంతగా భావిస్తాం. అలాంటి అనుభూతులు మిగిల్చే కాకి నగరాలు, పట్టణాల్లో కనుమరుగైపోతోంది.. మనిషి తన మనుగడ కోసం చేపట్టే పర్యావరణ వ్యతిరేక చర్యలే ఇందుకు కారణమవుతున్నాయి. అవే ఇప్పుడు మనిషి మరణానంతరం పెట్టే పిండం తినేందుకు కూడా కాకుల్ని లేకుండా చేసేస్తున్నాయి. ఇటీవల ఆడి అమావాస్య సందర్భంగా నగరంలో ఎంతోమంది తమ పితృదేవతలను స్మరించుకుంటూ తీర్థకొలనులు, నది, సముద్ర తీరాల్లో తర్పణాలు వదిలితే.. ఆ సందర్భంగా పెట్టిన పిండం తినేందుకు కాకులు కరువైపోవడం పలువురిని తీవ్రమనస్థాపానికి గురి చేసింది. కాకులకు ఆహారం అందిస్తే పితృదేవతలకు సమర్పించినట్లు నమ్మకం. తాము సమర్పించే ఆహారం కాకులు రుచి చూడకపోతే, పితృదేవతలు తమపై అలిగారేమోనని వారు చింతిస్తుంటారు. తామేమైనా తప్పు చేశామేమోనని కుటుంబ సభ్యులతో సమాలోచనలు చేస్తుంటారు. ఆ సమయంలో వారికి అనిపించిన ఒక్కో లోపాన్ని చెబుతూ వాటిని సరిదిద్దుకుంటామని వేడుకుంటూ కాకులను ఆహ్వానిస్తుంటారు. అనంతరం కాకులు వచ్చి ఆహారం తీసుకుంటే వారి ఆనందం అంతాయింతా కాదు. అయితే గురువారం జరిగిన ఆడి అమావాస్య సందర్భంగా తర్పణం వదిలిన చాలామంది కాకులు కనిపించక, తీవ్ర మనస్తాపంతో వెనుదిరగాల్సివచ్చింది. నగరంలో ఇష్టానుసారంగా చెట్లు నరికేయడం, కలుషిత నీరు కాలువల్లో ప్రవహిస్తుండడం, ఆహారం, నీరు అందుబాటులో లేకపోవడం, రేయింబవళ్లు వాహనాల రణగణధ్వనులతో బెంబేలెత్తిపోయిన కాకులు దూర ప్రాంతాలకు వెళ్లిపోయి వుంటాయని అంచనా.

### మేలుకోకుంటే ముప్పే!

దీని గురించి ఓ పర్యావరణ వేత్త మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో పంట పొలాలు, ఆహారం అందుబాటులో ఉండడం, చెట్లు, కలుషితం కాని వాతావరణంలో పక్షులుంటాయని, కానీ నగరంలో పరిస్థితి వీటన్నింటికీ భిన్నంగా ఉండడమే కాకులు కనిపించకుండా పోవడానికి కారణమని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ చాలామంది తాము భోజనం చేసే ముందు రెండు ముద్దలు ఇంటి బయట పక్షులకు పెడుతుంటారని, కానీ నగరంలో అలా ఆహారం పెట్టే నాథుడే లేడని వాపోయారు. నగరం అంతా కాంక్రీటుమయం కావడంతో చెట్లు లేక పక్షులు నివశించేందుకు అవకాశం లేదని తెలిపారు. 1970 ప్రాంతంలో నగరంలో వాగులు, వంకలు, చెరువులు వంటివి 650 ఉండగా, 2015 నాటికి అవి 27కు తగ్గిపోయాయని వివరించారు. పక్షి జాతి కనుమరుగవుతోందంటే.. పర్యావరణం పూర్తిగా దెబ్బతింటోందని అర్థమని చెబుతూ.. ప్రజలు, ప్రభుత్వాలు ఇప్పటికైనా మేల్కొనాల్సిన అవసరముందని హెచ్చరించారు.